**Islam Calls You** (Telugu)

# ఇస్లాం పిలుపు


మూలం : అబ్దుల్లా అడియార్
అనువాదం : అబ్దుల్ వాహెద్



ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారాకాంప్లెక్స్
ఫ్లాట్‌నెం.**106**, పత్తర్‌గట్టి, హైదరాబాద్-**2**,
ఫోన్ నెం. **66710795, 9441515414**

వెల............................రూ. 25/-లు





Name of the Title: Islam Pilupu (Telugu) (Islam Calls You)

Author : **Abdullah Adiyar** Chennai

Translation : Abdul Wahed Hyderabad



All rights reserved with: Islamic Resource Centre



First Edition: November, 2010

Copies: 1000

Published by: Islamic Resource Centre, Sahara Complex-106, Pathargatti, Hyderabad-2, Ph: 9441515414

Type set by: Alifain, I.R.C. Graphics, Sahara Complex-106, Pathargatti, Hyderabad-2, Ph: 040-66710795

Printed at: H.S. Offset Printers, 714, Chandni Mahal, Daryaganj, New Delhi-2, Ph: 23244240

Price: Rs. 25/-

# అబ్దుల్లా అడియార్ గురించి

అబ్దుల్లా అడియార్ తమిళనాడులోని తిరుపూర్‌లో 1935 మే 16న జన్మించారు. ఇంటర్మీడియట్ వరకు ఆయన విద్యనభ్యసించారు. 1955లో చదువు ముగిసిన తర్వాత ఆయన తమిళ దినపత్రిక 'మురసోలి'లో న్యూస్ ఎడిటర్‌గా చేరారు. డా. కరుణానిధి సంపాదకత్వంలో వెలువడుతున్న ఈ పత్రికలో 17 ఏళ్ళపాటు పనిచేశారు. దాదాపు 13 నాటకాలు రచించి, స్వయంగా నటించారు కూడా. ఆయన మంచి కవి. స్త్రీ ఇతివృత్తంగా ఆయన రాసిన కవిత అసాధారణ ప్రాచుర్యం పొందింది. 'Wife- My Pea cock' ఆయన రాసిన కవితల్లో ప్రఖ్యాతిగాంచిన కవిత. ఇది ఇంగ్లీషుతో సహా అనేక భాషల్లోకి అనువదించబడింది. ఆయన ముగ్గురు తమిళ ముఖ్యమంత్రుల (అన్నాదురై, కరుణానిధి, ఎం.జి.ఆర్.)తో కలసి పనిచేశారు. ఆయన మంచి వాగ్ధాటిగల వక్త. ఆయన కథా రచయితగా రాసిన అనేక కథలు వివిధ తమిళ పత్రికల్లో అచ్చయ్యాయి. 1982లో ఆయనకు తమిళ ప్రభుత్వం 'కలైమామణి' అవార్డునిచ్చి సత్కరించింది.

ఆయన డి.ఎం.కే. పార్టీతో సన్నిహితంగా ఉండేవారు. 1976లో కేంద్ర ప్రభుత్వం తమిళనాడులోని డి.ఎం.కే. ప్రభుత్వాన్ని రద్దుచేసింది. అడియార్ రాజకీయ ఖైదీగా జైలుకెళ్ళారు. జైలులో అనేక కష్టాలు భరించారు.

ఇక జైలు నుంచి బయటపడే అవకాశం లేదనుకొన్నారాయన. జైలు అధికారులను అడిగి వివిధ మతగ్రంథాలు చదవడానికి అనుమతిపొందారు. అనేకమతాలను లోతుగా తులనాత్మకంగా అధ్యయనంచేసి, ఇస్లాం తప్ప మరే ధర్మంలోనూ వాస్తవిక ఆధ్యాత్మికత, భౌతికశాంతి లభించదని గ్రహించారు.

1977లో ఆయన జైలు నుంచి విడుదల అయిన తర్వాత, తన పత్రిక 'నీరోట్టం'లో ఇస్లాం గురించి వ్యాసాల పరంపర రాసారు. ఈ వ్యాసాలన్నీ 'నేను ఆరాధించే ఇస్లాం' అన్న పేరుతో పుస్తకంగా అచ్చయ్యాయి. ఉర్దూ,



హిందీ, మలయాళం, తెలుగు తదితర అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి. ఆయన ఇస్లాం గురించి రాసిన పుస్తకాలు, చేసిన ప్రసంగాలు పలువురిని ఆకట్టుకొన్నాయి. అనేకమంది ఇస్లాం స్వీకరించారు.

చివరకు ఆయన 1987 జూన్ 6వ తేదీన ఇస్లాం స్వీకరించి అబ్దుల్లా అడియార్ అయ్యారు. ఇస్లాం సందేశప్రచార కార్యక్రమానికి అంకితమయ్యారు.

# విషయ సూచిక


| అధ్యాయం | పేజి |
|---|---|
| 1. సందేశ ప్రచారం ఎందుకు? | 05 |
| 2. నాస్తికులకు పిలుపు | 07 |
| 3. కుటుంబ సభ్యులకు పిలుపు | 12 |
| 4. క్రైస్తవులకు పిలుపు | 17 |
| 5. హిందువులకు పిలుపు | 27 |
| 6. అంటరానివారికి పిలుపు (దళితులకు) | 30 |

*కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం*

# సందేశ ప్రచారం ఎందుకు?

ఇస్లామీయ విశ్వాసం, ఇస్లామీయ స్పృహ ఉన్న ప్రతి ముస్లిమ్ ఆచరణలు ధార్మికంగా ఉండాలని ఖుర్‌ఆన్, ప్రవక్త ప్రవచనాలు బోధిస్తున్నాయి.

అంతేగాక, సందేశ ప్రచారం అన్నది అల్లాహ్‌కు అత్యంత ఇష్టమైన ఆచరణ. దైవప్రవక్త (స) తన జీవితం అలుపెరుగక సందేశ ప్రచారాన్ని కొనసాగించారు. ఆయన ప్రతిరోజు, ప్రతి నిమిషం సందేశ ప్రచారం కోసం వెచ్చించారు. ప్రస్తుతం, ప్రపంచంలో చాలామందికి ఇస్లామీయ సందేశం ఏమిటో తెలియని పరిస్థితి ఉందన్నది వాస్తవం. ఈ వాస్తవాన్ని గుర్తించిన మనం సందేశ ప్రచారాన్ని కొనసాగించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కార్యక్రమం 'సున్నత్' ఆచరణల్లో చాలా శ్రేష్ఠమైనది.

ఇస్లాం ప్రచారం అంటే ధార్మిక బీజాలను నాటడం వంటిది. ఇస్లాం సందేశం తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉన్న వ్యక్తిని, లేదా సమూహాలను గుర్తించి ఆ దిశగా మన ప్రయత్నాలను కేంద్రీకరించవలసి ఉంది.

తరచుగా కలసి మాట్లాడటం, చర్చించడం ద్వారా మనం ప్రత్యేక వ్యక్తితో మన పరిచయాన్ని పెంచుకోగలం. కష్ట సమయాల్లో, దుఃఖబాధల్లో ఆదుకొని మనం నిజమైన మిత్రులమని నిరూపించుకోవాలి.

అదీగాక, ఇస్లామీయ వ్యవహార శైలి చాలా అవసరం. సత్యమార్గం, సన్మార్గం అన్నది ప్రేమ, కరుణలతో వ్యవహరించే ప్రజలు అనుసరించే మార్గమే అన్న నమ్మకం ఆ వ్యక్తిలో పాదుకొనాలంటే మన వ్యవహార శైలి ఇస్లామీయ సూత్రాలకు పూర్తి అనుగుణంగా ఉండటం అవసరం.

సందేశ ప్రచారం కొనసాగిస్తున్న వ్యక్తులలో తలెత్తే సందేహాలు ప్రశ్నలను ఇస్లామీయ సాహిత్యం, ఇస్లామీయ సాహిత్యం గురించిన చర్చలు నివారిస్తాయి.



ఇస్లాం ఒక సూదంటురాయి వంటిది. ఆకర్షణకు గురయ్యే లక్షణం ఉన్న ప్రతిదీ ఇస్లాం వైపునకు ఆకర్షించబడుతుంది. సందేశ ప్రచార కార్యకర్తలు చేయవలసింది కేవలం ప్రేరణ నివ్వడం మాత్రమే. ఇస్లాం దిశగా లక్ష్యం ఆకర్షించబడితే అది కేవలం అల్లాహ్ అభీష్టం వల్ల జరిగిన క్రియ మాత్రమే. హితబోధ ఇవ్వగలిగిన వాడు అల్లాహ్‌యే.

ధర్మపరిజ్ఞానం తెలియక, చీకట్లలో ఉన్న ముస్లిమేతరుల పట్ల ప్రేమాభిమానాలతో మనం ఈ సందేశ ప్రచారం కొనసాగిస్తున్నాము.

అన్నింటికీ మించి, సందేశ ప్రచార కార్యక్రమం వల్ల అల్లాహ్ సంతుష్టి చెందుతాడు. సందేశ ప్రచారకులపై తన ప్రత్యేక అనుగ్రహాలు వర్షింపజేస్తాడు.

సందేశ ప్రచార కార్యక్రమానికి పూనుకోలేని స్థితిలో ఉన్న ముస్లిములు సందేశ ప్రచారకులకు సహాయపడాలి, వారికోసం దైవాన్ని వేడుకోవాలి. అలా చేయడం వారి ధార్మిక విధి.

**అబ్దుల్లా అడియార్**
అధ్యక్షుడు
ఇస్లామిక్ దావహ్ మిషన్ ఆఫ్ ఇండియా
సి–11–42, భూపతినగర్, కోడంబాకం
చెన్నయ్–600024, ఫోన్:044–2427663

# నాస్తికులు, హేతువాదులకు పిలుపు

(బ్రాదర్ అబ్దుల్లా అడియార్ మద్రాసు నగరంలో, దాని చుట్టుప్రక్కలా జరిగిన అనేక 'మీలాదున్నబి' కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. ఆయన ఈ కార్యక్రమాల్లో చేసిన ప్రసంగాలే ఈ చిరు పుస్తకం. ముస్లిమేతరులు, ఇస్లాంను అర్థం చేసుకోవడానికి ఈ ప్రసంగాలు ఎంతైనా తోడ్పడతాయి.)

ప్రియసోదరులారా! మీకు శాంతి కలుగుగాక!

దైవప్రవక్త ముహమ్మద్ (స) జన్మదినోత్సవాలు కేవలం ముస్లిములకే సంబంధించినవయితే, తమ సొంత దైవప్రవక్తగా ఆయన్ను స్తుతించి, కీర్తించడానికి ఈ ఉత్సవాలు పరిమితమయితే, వారీ ఉత్సవాలను తమ ఇళ్ళల్లో నాలుగ్గోడల మధ్య జరుపుకోవడం మంచిది.

అయితే ముస్లిములు ఈ ఉత్సవాలను బహిరంగంగా, మైకుసెట్లు, లైటింగు వగైరా ఏర్పాట్లతో, ముస్లిమేతరులను సయితం ఆహ్వానించి ఎందుకు జరుపుతున్నారన్నది ఆలోచించవలసిన ప్రశ్న.

ప్రపంచంలో ఎంతో శ్రేష్ఠధర్మం అయిన ఇస్లాం ముస్లిములకు మాత్రమే సంబంధించినదైతే, దైవప్రవక్త ముహమ్మద్ (స) ముస్లిములకు మాత్రమే ప్రవక్త అయితే, ముస్లిమేతరుల ప్రతిస్పందన ఎలా ఉంటుంది?

వారు నిస్పృహకు గురికావచ్చు, ఈర్ష్యా-అసూయలకు గురికావచ్చు. చివరకు విద్వేషానికి దారితీయవచ్చు.

కాని, నిజం చెప్పాలంటే ఇస్లాం, దైవప్రవక్త ముహమ్మద్ (స) తమ సొంతమని చెప్పుకునే హక్కు ఏ ముస్లిమ్‌కూ లేదు. అంతేకాదు అలా చెప్పుకునే ఆధారం ఏదీ వారి వద్ద లేదు.

మరి, దైవప్రవక్త ఎవరన్నది ప్రశ్న. ఆయన ముస్లిములకు, క్రైస్తవులకు, హిందువులకు, నాస్తికులకు, హేతువాదులకు, ఇంకా చెప్పాలంటే ఎలాంటి ధర్మం లేనివారికి, యావత్ మానవాళికి దైవప్రవక్త.



ఇలా చెప్పడానికి మనవద్ద అవసరమైన నిరూపణ దివ్య ఖుర్ఆన్‌లో ఉన్నది. 'దైవప్రవక్తలు' అన్న అధ్యాయంలో దేవుడు "మహాప్రవక్త ముహమ్మద్ (స) యావత్ మానవాళికి కారుణ్యం" అని పేర్కొన్నాడు.

"ఆయన మాకు కూడా ప్రవక్తేనా!" అని క్రైస్తవ సోదరులు అడగవచ్చు. "అవును" అన్నదే జవాబు. ఎందుకంటే, క్రైస్తవులు కూడా గ్రంథ ప్రజలేనని ముస్లిములు విశ్వసిస్తారు కనుక.

ఖుర్ఆన్‌లో ఈ విషయమై "గ్రంథప్రజలారా! నిజంగా, మా ప్రవక్త మీ మధ్యకు వచ్చాడు" అని దేవుడు పేర్కొన్నాడు. క్రైస్తవుల మధ్యకు మహాప్రవక్త వస్తారన్న సూచనపై ఖుర్ఆన్ వాక్యంలో ఉంది.

అయితే క్రైస్తవులు ఈ వాదనను ప్రశ్నించవచ్చు. తమ గ్రంథాల నుంచి ఈ విషయమై రుజువు కోరవచ్చు. కొత్త నిబంధనలో స్వాంతన నిచ్చే వాని ఆగమనం గురించిన అధ్యాయంలో ఈ వాస్తవం స్పష్టంగా ఉంది. క్రీస్తు స్వయంగా తెలిపిన మాటలు ఇందులో ఉన్నాయి. అందులో ప్రస్తావించబడిన "స్వాంతన నిచ్చువాని" గుణగణాలను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) గుణగణాలకు మధ్య పూర్తి సారూప్యం ఉంది.

ఈ వాస్తవాన్ని క్రైస్తవులు గుర్తిస్తే, దైవప్రవక్త ముహమ్మద్ (సలల్లాహు అలైహి వసల్లమ్)ను వారు తమ ప్రవక్తగా అంగీకరించి తీరుతారు.

## హిందువులకూ ప్రవక్తే

ఒక అరేబియా నివాసి భారతదేశ హిందువులకు ప్రవక్త ఎలా అవుతారని మీరు అడగవచ్చు.

కాని, మనం హిందూ గ్రంథాలను చదివితే, ముఖ్యంగా రుగ్వేదంలో, భవిష్యపురాణంలో కొన్ని శ్లోకాలు ఎడారి నుంచి వచ్చే, ఒంటె అధిరోహించే ప్రవక్తను గురించి కనబడతాయి. ఆ ప్రవక్త పేరు 'మహామథ్'గా ప్రస్తావించ బడింది. అది మహాప్రవక్త ముహమ్మద్ (స) పేరు తప్ప మరొకటి కాదు.

నా ఈ విశ్లేషణ ఒక హిందూ పండితునికి ఆగ్రహ కారణం అయ్యింది. హిందూ పురాణాల్లో లేనిదంటూ ఏదీ లేదని వాదించాడు. కోపం పట్టలేక నన్ను తీక్షణంగా నిలదీస్తూ హిందూ ధర్మంలో లేని కొత్త సందేశం ఇస్లాంలో ఏముందో చెప్పమని ప్రశ్నించాడు.

అతని ఆగ్రహం చూసి నేను చిరునవ్వుతో, ఇస్లాంలో ఎలాంటి కొత్త సందేశం లేదని అంగీకరించాను. అంతేకాదు, మునుపటి ప్రవక్తలు, దివ్య గ్రంథాలలోని సందేశం తప్ప కొత్త సందేశం ఏదీ ఇస్లాంలో లేదన్న ఖుర్‌ఆన్ సూక్తిని కూడా వినిపించాను.

ఆ వ్యక్తికి నా మాటలు నచ్చాయి. నేను ఇంకా ఏం చెప్పబోతానా అని ఆసక్తిగా వినడం ప్రారంభించాడు.

"హిందూధర్మంలోనూ దేవుని ఏకత్వం గురించిన సందేశం ఉంది. ఉపనిషత్తులు ఈ విషయాన్నే చెబుతున్నాయి. తమిళ సాధువు 'తిరుమూలార్' అందుకే 'ఒకే దేవుడు', 'ఒకే ప్రజ' అంటూ తీర్మానించాడు. కాని, అనేక దేవుళ్ళను ఆరాధించండని చెప్పే శ్లోకాలు, తాత్పర్యాలు కూడా ఉన్నాయి."

"శిలా విగ్రహాల ఆరాధనను ఖండిస్తూ 'శివవక్కియార్' రాసిన గేయం ఉంది. అలాగే రాళ్ళు రప్పలను పూజించండని చెప్పే పాటలూ ఉన్నాయి."

"ప్రాపంచిక జీవితంలో నీతి నియమాలకు సంబంధించిన బోధనలు ఇస్లాంలో మాదిరిగా హిందూధర్మంలోనూ ఉన్నాయి. అయితే వైరుధ్యాలు, అయోమయంతో కూడుకున్న వ్యాఖ్యలు ఆ ధర్మంలో ఎక్కువగా ఉన్నాయి."

"అందుకే మహాత్మగాంధి ఇస్లాంబోధనలు కల్తీ లేనివనీ, కాగా హిందువులు ధార్మికంగా, జీవన విధానం రీత్యా అయోమయంలో ఉన్నారని అంగీకరించవలసి వచ్చింది."

"హిందూధర్మంలో మనిషికి అత్యవసరమైన బోధనలు అనవసర వ్యాఖ్యలు కలగలిసి ఉన్నాయి. కాగా, ఇస్లాంలో మనిషికి అత్యవసరమైన బోధనలు ఒక క్రమపద్ధతిన ఉన్నాయి."



నా ఈ మాటలు ఆ హిందూ పండితుని సంతృప్తపరచాయి. అయితే ముహమ్మద్ (స)ను దైవప్రవక్తగా తానెందుకు అంగీకరించాలని ప్రశ్నించాడు.

నేను చెప్పాను, "మీరు మీ తోటలోని పూలకన్నా ఇస్లాం బోధనలు మీ హృదయానికి దగ్గరగా ఉన్నాయని ఒప్పుకుంటే, ఈ ఇస్లాం బోధనల పూదోటకు తోటమాలి లాంటివారు మహాప్రవక్త. ఆయన మీ జీవితవిధానానికి అవసరమైన సలహాలిస్తారు. చెడులు, అనవసర విషయాల గురించి హెచ్చరిస్తారు. చెడులను దూరం చేసుకోండని, మంచిని పెంపొందించండని బోధిస్తారు.

"ఎవరయినా మీకు మంచి మాటలు చెబితే మీరు వ్యతిరేకిస్తారా!

"ఎవరయినా బోధకుడు చెడు గురించి, దుర్మార్గం గురించి హెచ్చరించినా మీరు ఆ చెడులను స్వీకరిస్తారా?

"అతడు మీకు సన్మార్గాన్ని చూపితే మీరు ముఖం తిప్పుకుంటారా?"

నా ఈ ప్రశ్నలకు ఆ హిందూ పండితుని మౌనమే సమాధనమయ్యింది. అతడి మౌనం అతడి మనోభావాలకు అద్దం పట్టింది. అతని మనస్సు మెత్త బడిందని, సన్మార్గాన్ని స్వీకరించడానికి సిద్ధమవుతోందని అర్థమయ్యింది.

ఆ తర్వాత నేను అతనితో ఇంకా మాట్లాడుతూ హిందూ సమాజం ముఖ్యంగా దక్షిణ భారత దేశంలోని సమాజం, మిగిలిన ప్రపంచంతో పోల్చితే విశాల దృక్పథం కలిగిన సమాజమనీ, ఒక మంచి బోధకుడు చెప్పే మాటలను అతడు ఏ జాతికి, ఏ ప్రాంతానికి చెందినవాడైనా హిందువులు అంగీకరిస్తారని అన్నాను. కాబట్టి దైవప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు సత్యాలు, మంచిమాటలని గుర్తిస్తే మరుక్షణం హిందువులు ఆయన్ను తమ ప్రవక్తగా అంగీకరిస్తారని అన్నాను నేను.

ఆ హిందూ పండితుడు దీర్ఘమైన ఆలోచనతో ఆలకించాడు. దైవం తలిస్తే, సమీప భవిష్యత్తులో హిందువులు కూడా మహాప్రవక్త ముహమ్మద్ (స) ను తమ ప్రవక్తగా అంగీకరిస్తారు.

## నాస్తికులకూ ప్రవక్తే

క్రైస్తవులు, హిందువులు దేవుడున్నాడని నమ్మే ప్రజలు. కాని నాస్తికులకు దేవుని ఉనికి పట్లగాని, దైవప్రవక్తల పట్లగాని ఎలాంటి నమ్మకం ఉండదు. అలాంటప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (స) నాస్తికుల కోసం కూడా వచ్చిన ప్రవక్త ఎలా అవుతారు. నాస్తికులు ఆయన్ను దైవప్రవక్తగా ఎలా అంగీకరిస్తారు?

నాస్తికులు కూడా మనుషులే. ఆది మానవుడు ఆదం (అలైహి) సంతతి లోని వారేకదా!

వారు ఎందుకు నాస్తికులుగా మారారు. దేవుడిని, దైవధర్మాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

దేవుడ్ని గురించి ఎలాంటి హేతువులేని, అర్థంలేని కల్పిత గాథల వల్ల, మతవ్యవస్థ, మతావలంబీకులు ఒడిగట్టిన కొన్ని అక్రమాల కారణంగా వారు తిరుగుబాటుకు పూనుకున్నారనీ, దేవుడిని, దైవధర్మాన్ని తిరస్కరించేవారుగా మారారని కొందరి వాదన.

దైవాన్ని వ్యతిరేకిస్తూ, దూషించే నాస్తికులంటే దయ్యాలాంటి వారని కొందరు ఖండిస్తుంటారు.

కాని, ఇస్లాంలోని జ్ఞానాన్ని గ్రహిస్తే నాస్తికులను నిందించే, ఖండించే పని మనం చేయలేము. నిజమైన ముస్లిం నాస్తికుల పట్ల సానుభూతి చూపుతాడు.

❖ నాస్తికులు తల్లి ఒడిలోని బిడ్డలాంటివారు. వారిలో దివ్య జ్ఞానాన్ని గ్రహించే దృష్టి అభివృద్ధి చెందలేదు.

❖ వారు తమకు త్రాగడానికి లభించే పాలను గుర్తిస్తున్నారు కాని ఆ పాలను ఎవరు సృష్టించాడో గుర్తించడం లేదు.

❖ వారు ఏడుస్తారు, కోపిస్తారు. చివరకు తమకు పాలిస్తున్న తల్లిని కాలితో తన్నుతారు కూడా.



ఒక బిడ్డ తల్లిని కాలితో తన్నితే, తల్లి చిరునవ్వుతో బిడ్డకు పాలు పడుతుంది. అదేవిధంగా దేవుడు అందరికీ తల్లివంటివాడు. నాస్తికులకు కూడా వారు తనను వ్యతిరేకిస్తున్నప్పటికీ, నిందిస్తున్నప్పటికీ, తనపై ఆగ్రహిస్తున్న పుటికీ ఆహారం అందజేస్తాడు. దేవుని దృష్టిలో నాస్తికులు తమ సృష్టికర్తను గ్రహించే జ్ఞానంలేని బిడ్డల వంటివారు. నాస్తికుల పట్ల ఇంత దయకు కారణం– దేవుడు అపార కృపాశీలుడు కావడమే.

"ఖుర్ఆన్‌లో ప్రవక్త ముహమ్మద్ (స) ను మానవాళి పట్ల కారుణ్యంగా అభివర్ణించడాన్ని గుర్తుచేసుకొంటే మనకు క్రింది విషయాలు అర్థమవుతాయి.

అపార కృపాశీలుడైన ఆ దేవుడు మానవాళికి ఒక కారుణ్యాన్ని ప్రసాదించాడు. ఆ కారుణ్యం నాస్తికులపట్ల కూడాను. వారూ మానవాళిలో భాగమే. కాబట్టి దైవప్రవక్త ముహమ్మద్ (స) వారికి కూడా ప్రవక్తయే."

ఈ విషయాన్ని నేనొక ఉదాహరణ ద్వారా వివరిస్తాను. ఒక కాలేజి ప్రిన్సిపల్ ఒక లెక్చరర్‌ను క్లాసులోకి పంపాడు. అంటే ఆ లెక్చరర్ క్లాసులోని విద్యార్థులందరికి ఉపాధ్యాయుడు. కొందరు విద్యార్థులు అతడిని తమ లెక్చరర్‌గా ఒప్పుకోక పోయినప్పటికీ అతడు వారికి కూడా ఉపాధ్యాయుడే. అదేవిధంగా మహాప్రవక్త ముహమ్మద్ (స) దేవుని తరఫున సర్వమానవాళి కోసం పంపబడినవారు. నాస్తికులు అంగీకరించినా, అంగీకరించకపోయినా ఆయన వారికి కూడా దైవప్రవక్తయే.

అయితే నేడు ప్రపంచంలోని నాస్తికులను గమనిస్తే వారు ప్రపంచంలోని మతాలన్నిటినీ, ప్రవక్తలందరినీ నిందిస్తారు, విమర్శిస్తారు.

కాని, ఆశ్చర్యమేమంటే ఇస్లాంను, ఇస్లాం ప్రవక్తను ఆదరించే, గౌరవించే హేతువాదులు అనేకమంది ఉన్నారు.

ప్రఖ్యాత నాస్తికుడు ఇంగర్‌సాల్ ఇస్లాంను ప్రాపంచిక ధర్మంగా ప్రశంసిస్తూ "మధ్యయుగ క్రైస్తవ బోధకులు స్వర్గం గురించి ప్రచారంచేస్తున్న కాలంలో ఇస్లాం ప్రపంచంలోని విజ్ఞత గురించి బోధించింద"ని అన్నాడు.

తమిళనాడుకు చెందిన పెరియార్ ఇ.వి. రామస్వామి రాజీ పడని నాస్తికులు. ఆయన ఇస్లాం గురించి మాట్లాడుతూ "ఇస్లాం బానిసత్వం నుంచి విముక్తి, అంటరానితనానికి ఔషధం" అని ప్రకటించారు. అంతేకాదు ఇస్లాం స్వేచ్ఛను, స్థయిర్యాన్ని, విజ్ఞతను అందరికీ ప్రసాదిస్తుందని చెప్పారు.

పెరియార్ రామస్వామి శిష్యుడు డా. అన్నాదురై ఇస్లాం గురించి చెబుతూ ఇస్లాం ప్రతి విషయాన్ని బోధిస్తుందనీ, మంచి విషయాలన్నీ వివరిస్తుందని అన్నారు. ఇస్లాం ప్రత్యేకత ఏమంటే, ఇస్లాం బోధనలు మహాప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా ఆయన జీవితకాలంలో నిరూపించబడ్డాయి. నిరూపణలేని బోధన ఏదీ లేదు. "ఆయన చిరునవ్వు మధురమైన మాటలు, హద్దులెరుగని సహనం నన్ను ఆయనకు భక్తునిగా మలిచాయి" అన్నారు అన్నాదురై.

మహాప్రవక్త ముహమ్మద్ (స) నాస్తికుల అభేద్య హృదయాలలో చొచ్చుకు పోయి వారిని తన భక్తులుగా మార్చుకున్నారు. మరే ఇతర మతానికి చెందిన ప్రవక్తకు ఇది సాధ్యపడలేదు.

(అబ్దుల్లా అడియార్ గారి ప్రసంగం ముగిసిన తర్వాత ద్రావిడ ఉద్యమా నికి చెందిన స్థానికనాయకుడు, అన్నాదురై అభిమాని 'కారికాలన్' లేచి తాను సత్యమార్గాన్ని అవలంబించదలిచానని ప్రకటించాడు. అల్‌హమ్దులిల్లాహ్– మద్రాస్‌లోని మింట్ స్ట్రీట్‌లో ఈ సభ జరిగింది).

## కుటుంబ సభ్యులకు పిలుపు

### ఇస్లాం- కుటుంబ జీవనాన్ని బోధించే ధర్మం

ఇస్లాం మానవాళిని శాంతి వైపునకు దైవవిధేయత వైపునకు పిలుస్తుంది. ఒకే దేవునికి పూర్తివిధేయత చూపాలంటుంది. అనేకమంది దేవుళ్ళు, అనేక కథలు మనశ్శాంతినివ్వవు. ఇవి స్వచ్ఛమైన దైవభావనను కలుషితం చేస్తాయి.

బహుదైవాలను గురించిన సిద్ధాంతాలు, వాదనలు "ఒకే దేవుడు" అన్న వాస్తవం ముందు వెలవెలబోతాయి. దేవుడు ఒక్కడ కాదని అనుకొంటే ఇక



దేవుళ్ళ సంఖ్యకు హద్దు అనేదే ఉండదు. ఒకే దేవుడు అన్న సిద్ధాంతంలోని ఔన్నత్యం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. అనేక దేవుళ్ళు అన్న సిద్ధాంతంలో పస లేదన్నది స్పష్టంగా అర్థమవుతుంది.

దేవునికి విధేయుత చూపడమంటే నియంతల నుంచి, మానవ కల్పిత శాసనాల నుంచి, నిరంకుశ పాలకుల నుంచి స్వేచ్ఛపొందడమే. బానిసత్వం అన్నది కులీనవర్గం పాలనకు సంబంధించిననది అయినా ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్నదయినా మరేదయినా సరే ఇస్లాం నిరాకరిస్తుంది. అది దేవుని పరిపాలన (థియోక్రసి)ని బోధిస్తుంది.

ఫ్యూడల్ ప్రభువులు, స్వార్థ ప్రయోజనాలు, కార్మిక నియంతృత్వం లేదా సైనిక నియంతృత్వం ఏవయినా సరే ఇస్లాం ముందు తలవంచక తప్పదు. ఇస్లాం మనిషిని బంధించిన శృంఖలాలన్నింటిని ఛేదిస్తుంది. "లాఇలాహ" అంటే దేవుళ్ళు, శక్తులు, శాసనకర్తలు ఎవరూ లేరు అన్న నినాదంతో మానవ సమానత్వాన్ని బోధిస్తుంది ఇస్లాం.

ఇక "ఇల్లల్లాహు" (అల్లాహ్ తప్ప). అంటే అల్లాహ్ ఒక్కడే దేవుడు, ఆరాధ్యుడు, సర్వశక్తిమంతుడు, శాసనకర్త, సృష్టికర్త అని అర్థం.

అగోచరమైన దేవునికి పూర్తిగా అంకితమవ్వడం ద్వారా మనిషి స్వేచ్ఛా జీవిగా బ్రతకాలని ఇస్లాం పిలుపునిస్తుంది. దృగ్గోచరాలయిన దేవుళ్ళెవ్వరికీ విధేయత చూపరాదని బోధిస్తుంది.

అయితే ఇస్లాం ఎలాంటి క్రమశిక్షణారహితమైన జీవితాన్ని అంగీక రించదు. సూర్యోదయంనుండి సూర్యాస్తమయం వరకు, పుట్టుక నుండి గిట్టే వరక అన్ని సమయాలకు సంబంధించిన నియమ నిబంధనలను ఇస్లాం నిర్ణయించింది. ఇలాంటి సమగ్రమైన నియమావళి, పాలకులు–పాలితులు అందరికీ వర్తించే సువ్యవస్థ మరే ఇతర మతాల్లో కానరాదు.

ధర్మోపదేశాలను ఏ మతమయినా ఇస్తుంది. ఏ వ్యక్తి అయినా ఇస్తాడు. అయితే ఇస్లాం ఉపదేశాలు మహాప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో ఆయన

జీవితవిధానాల ద్వారా సత్యాలని నిరూపణయ్యాయి. ఆయన తాను బోధించిన ప్రతిదీ ఆచరించి చూపారు. ఆయన తాను ఆచరించినదే బోధించారు. అందుకే ఆయన జీవితం యావత్తు మానవాళికి అత్యున్నత ఆదర్శం అయ్యింది.

అయితే ఆయనజీవితం 7వ శతాబ్దినాటి ప్రజలకు మాత్రమే ఆదర్శమా? కేవలం అరేబియా దేశానికి మాత్రమే వర్తించే ఆదర్శమా? ఆయన ఆచరించి చూపిన ఆదర్శ జీవితం, ఆయన పరమపదించడంతోనే ముగిసిపోయిందా? కాదు, శతాబ్దాలుగా ఆయన చూపిన ఆదర్శనీయ విశ్వాసాలు, నడవడి, జీవ నదిలా ముస్లిం సమాజంలో నిరంతరం ప్రవహిస్తూ వస్తున్నాయి. ఇతర మత ధర్మాలను పరిశీలిస్తే ఆయా మతాల బోధకులు తమ అడుగుజాడల్లోనే అనుయాయులు నడవాలని కఠినంగా చెప్పలేకపోయారు. ఎందుకంటే ఆయా బోధకులు సాధుజీవనాన్ని, సన్యాసాన్ని అవలంబించి బ్రతికారు.

కాని, కుటుంబ జీవనం, సంసారం, లైంగికక్రియ అన్నింటా ఆదర్శవంత మైన పాఠాలను అందించిన మత ప్రవక్త ఒక్క ముహమ్మద్ (స) మాత్రమే. ఆయన జీవితం ఒక తెరచిన పుస్తకం. శ్రద్ధగా చదివి అర్థం చేసుకొని ఆచరించ వలసిన జీవితం. దైవవిశ్వాసులు సంసార జీవితాన్ని సైతం గడపడానికి ఆదర్శనీయ మార్గాన్ని చూపే పుస్తకం అది.

## ఇస్లాం- సంసార జీవితం గడిపేవారి ధర్మం

ఇతర మతాలు సంసార జీవితానికి; మతవిశ్వాసాలకు, ఆరాధనలకు మధ్య ఎలాంటి సామీప్యాన్ని చూపవు. ప్రాపంచిక జీవితం అన్న జంఝాటం నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడాలని బోధిస్తాయి. కాని, ఇస్లాం విశ్వాసాలు, ఆరాధనల గురించి నొక్కి చెప్పినప్పటికీ, మనిషి సంసార జీవితాన్ని ఆరాధనలకు సమానంగానే భావిస్తుంది.

ధర్మం అంటే ఇతర మతాల ప్రకారం మనిషికి దైవానికి మధ్య వ్యక్తిగత సంబంధమే. కాని ఇస్లాం తన అనుయాయులను ప్రాపంచిక జీవితంలోని విధులు, బాధ్యతలను దైవాదేశాల ప్రకారం నిర్వర్తించాలని బోధిస్తుంది.



ఇతర మతాలు వాస్తవాలకు దూరంగా నిలబడివుంటే ఇస్లాం ప్రాపంచిక జీవనంలోని వాస్తవాలకు అతి దగ్గరగా నిలబడి ఉంది.

ఇస్లాం పరలోకాన్ని పట్టించుకోదా అని కొందరు అభిప్రాయపడవచ్చు. కాని, ఖుర్ఆన్‌లోని ప్రతి అధ్యాయంలో తరచుగా మరణానంతర జీవితం గురించి, తీర్పుదినం గురించి, స్వర్గ నరకాల గురించి ప్రస్తావించింది.

పైగా ఇస్లాంలోని అత్యంత శ్రేష్ఠమైన, అందమైన భావన ఏమిటంటే– పరలోకంలో సుఖవంతమైన శాశ్వత జీవితం లభించాలంటే, ఇహలోకంలో పవిత్ర జీవితాన్ని గడపాలి. నిజాయితీ, సద్వర్తనాలు లేని ప్రాపంచిక జీవితం, దైవవిశ్వాసాలు దీర్ఘకాలం ఉండవు. ఇస్లాం ప్రకారం ప్రాపంచిక జీవితం పరలోకంపై ఆధారపడి లేదు. అలాఅని ప్రపచంలో జీవితం స్వతంత్రంగానూ లేదు. ఈ రెండు జీవితాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి.

ఆశ్చర్యమేమంటే, కొన్ని మతాల్లో ప్రాపంచిక జీవనం అంటే సంసార జీవితాన్ని పూర్తిగా త్యజించడమే. దాన్ని ఒక పాపంగా పేర్కొనడం జరిగింది. కొన్ని మతాల బోధకులు ప్రజలను 'ఓ పాపులారా' అని సంబోధించారు. కొందరు బోధకులు సంసారజీవితాన్ని పాపపంకిలంగా పేర్కొన్నారు.

కాని, ఇస్లాం సంసార జీవితాన్ని దేవుడిచ్చిన వరంగా పేర్కొంటుంది. సంతానాన్ని దేవుని కారుణ్యంగా పేర్కొంటుంది. మానవులంతా ఆదం (అలైహి) సంతానంగా తెలియజేస్తుంది. ప్రాపంచిక జీవితం పరలోకానికి సంబంధించిన ఒక పరీక్ష అని పేర్కొన్నది. ఎంతచక్కని బోధనలివి.

కొన్నిమతాలు ప్రపంచంలోని సంబంధబాంధవ్యాలు భ్రమలుగా చెబుతూ వాటి పట్ల అపనమ్మకాన్ని కలిగిస్తాయి. కాని ఇస్లాం ప్రకారం ప్రజలు దేవుని ఉనికిని, ఆయన సృష్టించిన వాటి ఉనికిని విశ్వసించాలి, ప్రపంచం, ప్రపంచంలోని సంబంధ బాంధవ్యాలు అన్నీ అందులో ఉన్నాయి.

కాబట్టి ఇస్లాం సమాజంలో ప్రశాంతతా పవనాలను వీచేలా చేస్తుంది. ఒండొరుల పట్ల విశ్వాస నమ్మకాలు దృఢమయ్యేలా చేస్తుంది.

ఇతర మతాల మాదిరిగా కాక, ఇస్లాం ఒక సంపూర్ణ జీవనవిధానం. మత విశ్వాసం విశ్వాసులకు, అవిశ్వాసులకు సంబంధించిన చరిత్ర పాఠాలు; హితోపదేశాలు; సాంస్కృతిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సమస్యలకు చక్కని పరిష్కారాలు; మానవ కల్పిత చట్టాల చట్రంలో ఉండే జీవితానికి సంబంధించిన సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. అదీగాక ఇస్లాం సోషలిస్టులు, న్యాయ నిపుణులు, చట్టనిపుణులు ప్రతిపాదించే సూత్రాలకు, చట్టాలకు భిన్నంగా కొత్త సూత్రాలను కూడా ప్రతిపాదిస్తుంది.

ఇస్లాం సత్యపథాన్ని చూపే ఏకైక ధర్మం. శాంతి, సత్యం, న్యాయం, ఆనందం నిండిన స్థిరమైన జీవనాలను అందుకొమ్మని పిలుపునిస్తుంది ఇస్లాం.

ఇతర మతాల గ్రంథాలు, మత నాయకుల బోధనలు చదివినట్లయితే మనకు కొన్ని పరిమిత విషయాలకు సంబంధించి చేయదగిన పనులు, చేయకూడని పనుల గురించి మాత్రమే తెలుస్తుంది.

కాని ఇస్లాంలో ప్రతి విషయానికి సంబంధించిన, మనిషి జీవితంలో ప్రతి దశకు సంబంధించిన ఉపదేశాలు లభిస్తాయి. పిల్లలు, యువకులు, వివాహిత స్త్రీ పురుషులు, వర్తకులు, సైనికులు, అన్నివిధాల వృత్తుల్లో ఉన్నవారు –అందరూ ఇస్లాం నుంచి స్పష్టమైన, వివేకవంతమైన సలహా సూచనలు పొందగలరు. వాటిద్వారా ఆనందభరిత జీవనాన్ని సాధించుకోగలరు.

సూర్యోదయానికి ముందు శుభ్రమైన శరీరంతో చేసే ఫజర్ నమాజ్ మీ అనుభవంలోకి వస్తే మీరు ఎంతో ఆనందం చవి చూస్తారు. ఆ ఆనందం రాత్రి (ఇషా) నమాజు వరకు కొనసాగుతుంది. చేయదగిన పనుల హితవులు, చేయకూడని పనుల ఆదేశాలు మనిషిని చెడుల నుంచి నిరోధించి సమాజం కోసం ఒక ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి.

రమజాన్ నెలలో ఉపవాసాలు మనిషి శరీరంలో, మస్తిష్కంలో రసాయనాల మార్పులకు గురిచేసి ఆరోగ్యాన్ని వృద్ధి చేస్తాయి. ధనికులు జకాత్ (పేదల ఆర్థిక హక్కు) చెల్లించడం వల్ల సమాజంలో దయ, కారుణ్యాలు



విస్తరిస్తాయి. పొరుగువారి పట్ల, తోటివారి పట్ల ప్రేమానుబంధాలు వెల్లి విరుస్తాయి. ఇతరులకు ఇవ్వడం వల్ల లభించే ఆనందం ఆత్మకు ప్రశాంతత చేకూరుస్తుంది. మనస్సును ప్రక్షాళనం చేసి మోదభరితం చేస్తుంది. జకాత్ అంటేనే ప్రక్షాళనం, పరిశుభ్రత అని అర్థం.

కాబట్టి, ఇస్లాం మిమ్మల్ని అత్యుత్తమ ఆదర్శాన్ని ఆచరించే అనుభవాన్ని రుచిచూడమని పిలుస్తోంది. ప్రపంచంలో విశ్వాసులు అనుభవించే కష్టాలను సాఫల్యంగా నిరూపించబడిన విధానం ఉంది ఇందులో.

కొత్తమతాన్ని అవలంబించే విషయంలో ప్రతి మనిషిలో తటపటాయింపు ఉంటుంది, నిజమే. కాని ఇస్లాంను అవలంబించడమంటే కొత్త మతంలోకి మారడం కాదు. మనిషి తన పాత ధర్మాన్ని మళ్ళీ స్వీకరించడమే. ఎందుకంటే ఇస్లాం మనిషికి సంబంధించిన మొట్టమొదటి ధర్మం.

ఏక దేవుని ఆరాధనతోనే “ఆరాధనల” చరిత్ర మొదలవుతుంది. మనిషి పూజలు చేస్తున్నప్పుడు అతని మనస్సులో ‘ఒకేదేవుడు’ ఉంటాడు. ఒకే దేవుడు అనే విశ్వాసాన్ని అంగీకరించిన ప్రతి వ్యక్తీ ఇస్లాం పరిధిలోకి వచ్చినట్లే.

మనిషి తన దుస్తులు, అలంకరణ సామగ్రి ఇతర వస్తువుల విషయంలో కొత్తవాటిని పొందాలనుకుంటాడు. ప్రభుత్వం వాటన్నిటికి సంబంధించిన అభివృద్ధి కోసం చట్టంచేస్తే అతను వెంటనే అంగీకరించి దానికి మద్దతిస్తాడు. అలాంటప్పుడు మనిషికి, అతని కుటుంబానికి శాశ్వత సుఖసంతోషాలు అందించే సత్యపథాన్ని (ఇస్లాం) ఎందుకు అంగీకరించ కూడదు!

మనిషి ఇస్లాం స్వీకరించగానే ప్రాపంచిక వస్తుసామగ్రి, కల్పిత గాథలకు సంబంధించిన అతని దైవం పట్ల విశ్వాసాన్ని చాటిచెప్పే అందమైన పేరుగా మారిపోతుంది. అంతేకాదు, అతని మతవిశ్వాసం ‘ఈమాన్’ (దృఢంగా ఉంటుంది. విశ్వాసం విషయంలో దృఢత్వాన్ని ప్రసాదిస్తుంది.

ఇస్లాంను అవలంబిస్తే, అయిదుపూటల నమాజు వల్ల మనిషి మస్తిష్కం, శరీరం మాలిన్యాలకు దూరం అవుతుంది.

మనిషి ఇస్లాం స్వీకరిస్తే అతడి వృత్తి, ఉద్యోగ, వ్యాపార వ్యాపకాలు భౌతిక ప్రయోజనాలకు మాత్రమే పరిమితమై ఉండవు. ఇస్లాంలోని హరాం, హలాల్, మంచీచెడు నియమనిబంధనల కారణంగా ఒక న్యాయబద్ధమైన, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వంగా అతడి నడవడిక ఉంటుంది.

ఇస్లాం స్వీకరణతో మనిషి సంసారజీవితం ఇతరులకు ఆదర్శంగా మారుతుంది. ఇస్లాంలో సంసార జీవితానికి సంబంధించి ఆదేశాలు ఎన్నో ఉన్నాయి. అదీగాక అతని సంతానం అత్యుత్తమ సంతానంగా పెరుగుతుంది. పిల్లలను అత్యుత్తమ రీతిలో పెంచే సూత్రాలు ఇస్లాంలోనే ఉన్నాయి.

దేవుని పేరుతో నేను మీఅందర్నీ సత్యపథానికి మరలిరమ్మని పిలుస్తున్నాను. ఈ పవిత్రభావం మీ మనోమస్తిష్కాల్లో ప్రవేశించనీయండి. మనోమస్తిష్కాలను సృష్టించింది దేవుడే. ఆయన మనిషికి సత్యమార్గాన్ని ఎన్నుకొని ఆచరించే స్వేచ్ఛ కూడా ప్రసాదించాడు.

# క్రైస్తవులకు పిలుపు

## ఒక క్రైస్తవ మహిళకు లేఖ

అబ్దుల్లా అడియార్ అల్లాహ్‌కు అర్పితమైన దైవదాసుడు. ఆయన కొందరు ప్రముఖ వ్యక్తులకు ఉత్తరాలు రాసి ఇస్లాం సందేశాన్ని వారి ముందుంచే ప్రయత్నం చేశారు. అలాంటి కొన్ని ఉత్తరాలు ఇక్కడ ఇస్తున్నాము.

గౌరవనీయులు, మేడమ్ బ్లాసమ్ వాజ్ (ప్రెసిడెంట్, ఆల్ ఇండియా క్రిస్టియన్ సర్వీస్ సొసైటి, మధురై)

మీకు శాంతి కలుగుగాక!

మీతో పరిచయం ఏర్పడినందుకు నేను దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీరు మీ పరిమిత వనరులతో బీదలకు కారుణ్యాన్ని పంచుతున్నారు. అణగారిన జనానికి ఉచిత న్యాయసహాయాన్ని, వ్యాధిగ్రస్తులకు మందులు, నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం సిఫారసులు అందజేస్తున్నారు.



అనాథలు చనిపోతే, వారి అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దైవం మీకు తగిన ప్రతిఫలం ఇవ్వుగాక! ఆమీన్.

ప్రపంచం భౌతికారాధనలో, ధనవ్యామోహంలో చిక్కుకొని ఉన్న ప్రస్తుత కాలంలో, బీదలకు నిరాపేక్షంగా సేవ చేయాలన్న పవిత్రభావాన్ని దైవం మీ మనసులో నాటుకునేలా చేశాడు.

మీరు ఆంగ్లో–ఇండియన్ సముదాయానికి చెందిన వారయినప్పటికీ, మీరు ఎల్లప్పుడు సత్యాన్ని, సన్మార్గాన్ని గ్రహించాలన్న జిజ్ఞాస ప్రదర్శిస్తూ వచ్చారు. అందువల్ల నేను మీకు, "I Love Islam" అన్న నా పుస్తకాన్ని ఇచ్చినప్పుడు మీరు ఇస్లాం గురించి మరింత తెలుసుకోవాలన్న ఆసక్తి చూపారు. "Essay on Critism"లో ఈ విషయాన్ని చక్కగా చెప్పారు. స్వల్ప అధ్యయనం ప్రమాదకరమైనది. తనివితీరా తాగండి లేదా జ్ఞానంఊటను (Pierian Spring) రుచి కూడా చూడవద్దు" అన్నారు.

క్రైస్తవులు ఎల్లప్పుడు పరిత్యాగాన్ని, సన్యాసాన్ని ఆదరిస్తూ వచ్చారు. దీనిక్కారణం బహుశా ఇతర మతధర్మాల బోధనల గురించిన అవగాహన లేకపోవడం కాబోలు.

ఇతర మతగ్రంథాలలో ఎక్కడా లేనివిధంగా ఇస్లాంలో జీసస్‌క్రైస్ట్ పేరు ప్రస్తావించబడిందని, అల్‌ఖుర్‌ఆన్‌లో క్రీస్తు పేరు అనేక పర్యాయాలు వచ్చిందని ఆయన్ని ముస్లింలు దైవప్రవక్తగా విశ్వసిస్తారని నేను చెప్పినప్పుడు మీరు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి విన్నారు. ఖుర్‌ఆన్‌లో క్రీస్తు పేరు ఈ క్రింది అధ్యాయాలలో ప్రస్తావనకు వచ్చింది.

| అధ్యాయం | సూక్తులు |
|---|---|
| 2 (బఖరా) | 87 |
| 3 (ఆలిఇమ్రాన్) | 45–59 |
| 4 (నిసా) | 157 |
| 4 (నిసా) | 171 |

| | |
|---|---|
| 5 (మాయిదా) | 17 |
| 5 (మాయిదా) | 72 |
| 5 (మాయిదా) | 75 |
| 5 (మాయిదా) | 78 |
| 5 (మాయిదా) | 110-120 |
| 9 (తౌబా) | 30 |
| 19 (మర్యం) | 16-34 |
| 23 (మోమినూన్) | 50 |
| 42 (షూరా) | 13 |
| 43 (జు(ఖుఫ్) | 57 |
| 43 (జు(ఖుఫ్) | 61 |
| 43 (జు(ఖుఫ్) | 63 |
| 61 (సఫ్) | 6 |

ముస్లింలు క్రీస్తు పేరుని గౌరవపూర్వకంగా ఈసా అలైహిస్సలామ్ (ఆయనపై శాంతి వర్షించుగాక) అని ఉచ్చరిస్తారు. కేవలం మర్యాద మన్ననల భావన మాత్రమే కాదు. అది వారి మతవిశ్వాసం నుంచి పుట్టిన భావన. ఏ ముస్లిమయినా క్రీస్తు పేరును ఉచ్చరిస్తున్నప్పుడు ఇలా గౌరవప్రదమైన పదాలు ప్రయోగించకపోతే అతను మర్యాదతెలియని అనాగరికునిగా భావించబడతాడు.

ఖుర్ఆన్‌లో పదిహేనుకు మించిన అధ్యాయాల్లో గౌరవనీయ జీసస్‌ను 'దేవుని వాక్యంగా', 'దేవుని చిహ్నంగా', 'దేవుని ఆత్మగా' ఇంకా అనేక విధాల గౌరవ వచనాలతో ప్రస్తావించడం జరిగింది.

అయితే త్రిత్వం (తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ)కు సంబంధించి, శిలువ వేయడం, పునరుజ్జీవనాలకు సంబంధించి ముస్లిములకు, క్రైస్తవులకు మధ్య అభిప్రాయభేదాలున్నాయన్నది వాస్తవం. కాని జీసస్ క్రీస్తును (ఆయనపై



శాంతి వర్షించుగాక) ఖుర్ఆన్ ప్రస్తావించిన విధంగా ప్రస్తావించిన మరో మతం ఏదన్నా ప్రపంచంలో ఉందా! చూడండి ఖుర్ఆన్ ఎలా ప్రస్తావించిందో:

**"అతని పేరు మర్యం కుమారుడయిన మసీహ్ ఈసా. అతను ఇహలోకంలోనూ, పరలోకంలోనూ గౌరవనీయుడవుతాడు. దైవసాన్నిధ్యం పొందినవారిలో ఒకడై పోతాడు." (ఖుర్ఆన్-3:45)**

గౌరవనీయ జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక) చూపిన మహిమల విషయానికి వస్తే మార్క్, మాథ్యు, లూకా, జాన్‌లు రాసిన గాస్పెల్‌లలోని విషయాలు- అంధులకు దృష్టి ప్రసాదించడం, కుష్టువారికి స్వస్థత ఇవ్వడం, మృతులకు ప్రాణం పోయడం మొదలైన వాటి గురించి క్రైస్తవులకు తెలుసు. కాని, మట్టి పక్షుల మహిమ గురించి మీరు విన్నారా!

**"ఇప్పుడు నేను మీ ముందు మట్టితో పక్షి ఆకారం గల బొమ్మ చేసి అందులో గాలి ఊదుతాను. అది దైవాజ్ఞతో సజీవ పక్షిగా మారుతుంది." (ఖుర్ఆన్-3:49)**

ఈ మట్టి పక్షి మహిమ క్రైస్తవులకు కొత్త విషయం. కాని బైబిల్ పండితులు ఈ మహిమ గురించి "Apocrydhal Gospel"లో ఉందని ఒప్పు కుంటారు. అంతేకాదు గౌరవనీయ జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక) పుట్టుకతోనే బోధకునిగా ఉన్నారని చెబుతుంది ఆ గాస్పెల్.

ఖుర్ఆన్‌లో ఒక అధ్యాయం మేరి పేరుతో ఉంది (19వ అధ్యాయం). మేరి మాతకు ఈ గౌరవం చివరకు క్రైస్తవ బైబిల్‌లోనూ లభించలేదు.

**"దైవదూతలు మర్యంతో "మర్యం! దేవుడు నిన్ను ఎన్నుకున్నాడు. నిన్ను పరిశుద్ధపరిచాడు. యావత్ప్రపంచ మహిళలలో నీకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి తన సేవ కోసం నియమించాడు." (ఖుర్ఆన్-3:42)**

ఇస్లాం అరబ్బులకు మాత్రమే సంబంధించినదయితే, ముహమ్మద్ ప్రవక్త (స) కుటుంబానికి మాత్రమే సంబంధించినదయితే, అరేబియాకు చెందిన ఎవరో ఒక మహిళను, లేదా ప్రవక్త ముహమ్మద్ (స) తల్లిగారిని, లేదా

ఆయన భార్యలలో, కుమార్తెలలో ఎవరో ఒకరిని ఎన్నికైన పరిశుద్ధ మహిళగా, ప్రపంచ మహిళలందరిపై ప్రాధాన్యం ఉన్న మహిళగా పేర్కొని ఉండేది.

అలాకాక ఒక యూద మహిళ అయిన మేరీమాతను పరిశుద్ధ మహిళగా, ఎన్నికైన మహిళగా, ప్రపంచ మహిళలపై ప్రాధాన్యం లభించిన మహిళగా ఖుర్ఆన్ పేర్కొన్న వైనమే ఈ గ్రంథం దేవుని వాక్కు అని, పూర్తి సత్యం అని, సత్యం తప్ప మరేమీ కాదని చెప్పడానికి ప్రబల తార్కాణం.

క్రైస్తవుల గురించి కూడా దివ్య ఖుర్ఆన్ ఇలా ప్రస్తావించింది:

**"విశ్వాసుల పట్ల అందరికన్నా ఎక్కువ శత్రువైఖరి అవలం బించేవారు యూదులు, బహుదైవారాధకులే. అది నీకూ తెలుసు. స్నేహసంబంధాల విషయంలో "మేము నసారా (సహాయకులం)" అన్నవారు విశ్వాసులకు చాలా దగ్గరగా ఉన్నారని కూడా నీకు తెలుసు. దానిక్కారణం వారిలో భక్తిపరులైన పండితులు, వైరాగ్యులైన సాధువులు కూడా ఉన్నారు. వారిలో ఏమాత్రం అహంకారం లేదు." (ఖుర్ఆన్-5:82)**

జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక)కు నిజమైన అనుయాయులైన క్రైస్తవుల పరిస్థితి ఏమిటీ? దానికి ఖుర్ఆన్ ఇచ్చే సమాధానం చూడండి:

**"ఈసా! నేనిప్పుడు నిన్ను నాదగ్గరికి రప్పించుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను. నిన్ను ధిక్కరించినవారి (దుష్ట పరిసరాల)నుండి (తీసి) నిన్ను పావనం చేస్తాను. నిన్ను తిరస్కరించినవారిపై నిన్ను అనుసరించిన వారికి ప్రళయం వరకు ఆధిక్యత నిస్తాను. చివరికి మీరంతా నాదగ్గరికే తిరిగివస్తారు. అప్పుడు నేను మీలో ఏర్పడివున్న విభేదాలను గురించి తీర్పు చెబుతాను." (ఖుర్ఆన్-3:55)**

అల్లాహ్ గౌరవనీయ జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక) ద్వారా క్రైస్తవులకు ఒక వాగ్దానం కూడా చేశాడు. వారు గనుక తమ ప్రవక్తను నిజాయితీగా అనుసరిస్తే, అసత్యాలు, ధర్మ నిందలకు పాల్పడనట్లయితే వారికి ఆధిపత్యం ఇస్తానన్నాడు.



మేడమ్! ఇదంతా చదివాక మీరు ఆనందభాష్పాలతో ఇస్లాం పట్ల ఒక విధమైన ఆకర్షణ, ఆదరణల అనుభూతి పొందిఉంటారు. ఇస్లాం మీకు మీ శరీరంలోని బృహద్ధమనికన్నా చాలా దగ్గరగా ఉన్నట్లు తెలుసుకొని ఉంటారు.

మీరు విజ్ఞత విచక్షణలతో కూడిన ఆచరణాదృక్పథం గల మహిళ అని నాకు తెలుసు. పురుషుల ప్రాబల్యమున్న నేటి ప్రపంచంలో అభాగినులయిన మహిళల కష్టాలు, బాధలను గురించి మీరు ఎప్పుడు పరితపిస్తుంటారు.

ముస్లిములు తమ మహిళలను అణచివేస్తారని, పరదాలలో బంధించి ఉంచుతారని, హక్కులేవీ ఇవ్వరని మీరు కూడా ఇతరుల మాదిరిగా అభిప్రాయ పడుతుండవచ్చు. కాని, మీరు ఖుర్ఆన్‌లోని 'అన్నిసా' (స్త్రీలు) అధ్యాయం అధ్యయనంచేస్తే స్త్రీకి ఇస్లాం ఎలాంటి స్థానమిచ్చిందో తెలుస్తుంది.

మానవ ప్రవృత్తిలో లైంగికవాంఛ అనేది ఒక అద్భుతమైన మిస్టరీ. పురుషుడు శారీరకంగా శక్తిమంతుడై తన జీవితంలో మహిళ పోషించే అతి ముఖ్యమైన పాత్రలను మరచిపోతున్నాడు. మనిషిని గర్భంలో భరించిన తల్లిగా మహిళ పట్ల గౌరవాదరాలు చూపవలసి ఉంది. ఒక భార్యగా మహిళ పోషించే పాత్ర వల్లనే పురుషుడు తండ్రి కాగలుగుతున్నాడు. అందువల్ల ఆమె పట్ల గౌరవం కలిగివుండాలి. స్త్రీ గర్భాశయాన్ని మానవాళిని పోతపోసే మూసగా అభివర్ణించిన మతగ్రంథాలు ఏవయినా ఉన్నాయా?

మేడమ్! నేను 'భార్య' అనే పేరుతో ఓ పుస్తకం రాశాను. బహుశా ఈ సంగతి మీకు తెలుసు. అందులో నేను గర్భాశయం అంటే ఏమిటో వివరించే ప్రయత్నం చేశాను. ప్రసవ సమయంలో స్త్రీలు తమ ప్రాణాలు పణంగా పెట్టి బాధను భరించవలసి ఉంటుంది. ఒక్కోసారి మృత్యువు కూడా తటస్థించవచ్చు.

ప్రసవ నొప్పులు, వెయ్యి ఉథములు
కటి ప్రాంతాన్ని ధ్వంసం చేసే నొప్పులు
వెయ్యి రంపాలు ఇక్కడ కోస్తాయి.
ఆమె శరీరం రెండుగా చీలుతుంది

వందలాది రోకళ్ళు దంచుతాయి
పగటి వెల్తురు చూడ్డానికి ఒక జీవి బయటికి వస్తుంది
ఆమె, నా జీవితంలో ప్రతిక్షణం
నన్ను ఆనందపరచడానికి బ్రతికింది.
నేడు రక్తపు నదిలో శ్వాస విడిచింది.

("Wife" - Pages 78,79)

స్త్రీ భరించే బాధలు పురుషుడు గుర్తిస్తే, అతడు తప్పక ఆమెను గౌరవంగా చూస్తాడు. ఎందుకంటే ప్రతి పురుషుడు తన జన్మ సమయంలో పగటి వెలుతురు చూడ్డానికి తల్లి గర్భాశయం నుంచి వచ్చినవాడే కదా!

మేడమ్! నిజమైన ముస్లిములు స్త్రీగర్భాశయాన్ని గౌరవించాలన్న దేవుని ఆదేశం స్వీకరించినవారు స్త్రీలహక్కులు కబళిస్తారంటే మీరు నమ్ముతారా!

భారత దేశంలో వరకట్నం కారణంగా యువతులు ఎదుర్కొంటున్న కష్టనష్టాల గురించిన చింత కూడా మీలో ఉంది. వరకట్నం కారణంగా అనేకమంది అమ్మాయిలు చివరకు వృద్ధకన్యలుగా మిగిలిపోతున్నారు. మరికొందరు సోకాల్డ్ అగ్ని ప్రమాదాలకు గురయి బొగ్గులుగా మారుతున్నారు. వరుని కుటుంబసభ్యులు కోరే రాకాసి కట్నం ఇవ్వలేకపోవడమే దీనిక్కారణం.

కాని ఖుర్ఆన్‌లో 'మహర్' (స్త్రీ ధనం) అన్న పదం ఉంది. ఈ పదం ఇతరులలో అనేక సందేహాలు జనింపజేయవచ్చు. కానీ వరకట్న సమస్యకు ఇదే పరిష్కారం. భారత మహిళల బానిసత్వానికి ఇదే విముక్తి. సంబంధిత ఖుర్ఆన్ వాక్యం క్రింద ఇస్తున్నాను.

**"స్త్రీలకు వారి మహర్ సంతోషంగా చెల్లించండి." (ఖుర్ఆన్-4:4)**

స్త్రీలకు ఆస్తి హక్కు లభించినపుడే వారి అభ్యున్నతి సాధ్యమవుతుంది. విమెన్స్ లిబరేషన్ మూమెంట్ నేతలు నేడు కనుగొన్న కొత్త విషయం ఇది. కాని ఇస్లాం ఏడవ శతాబ్దిలోనే స్త్రీలకు ఆస్తి హక్కు ఇచ్చింది.



ఖుర్ఆన్ 4వ అధ్యాయంలో పురుషుల ఆస్తులపై స్త్రీల హక్కులు, ఆస్తి పంపిణి గురించి వివరాలు ఉన్నాయి. అంతేకాదు ఆస్తిలో ఎలాంటి హక్కులేని వారికి కూడా ఇవ్వమని పేర్కొన్న వాక్యం మిమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

**"ఆస్తిపంపిణి జరుగుతున్నప్పుడు వారసులుకాని (నిరుపేద) బంధువులు అనాథలు, అగత్యపరులు ఎవరైనా వస్తే వారిక్కూడా ఎంతోకొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి. " (ఖుర్ఆన్-4:8)**

యావత్ ప్రపంచంలో ఇస్లామీయ వ్యవస్థ ప్రకారం ఆస్తుల పంపకాలు జరిగితే సమాజంలోని నిమ్నోన్నతలను రూపుమాపే ఊహా జగత్తు నిజంగా మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. అందుకే నెపోలియన్ తాను ఖుర్ఆన్ బోధనల ప్రకారం నడిచే సమాజాన్ని స్థాపించదలచినట్లు ప్రకటించాడు.

మేడమ్! ఓసారి మీరు నేడు పెళ్ళిళ్ళు జరుగుతున్న తీరుపట్ల ఆందోళన వెలిబుచ్చారు. ఇష్టంలేని పెళ్ళి జరిగిన స్త్రీల కన్నీటి వల్లనే సముద్రం ఉప్పగా మారిందని ఎవరో వ్యంగ్యంగా అన్నారు. అయితే ఈ సందర్భంగా ఇస్లాం పురుషులకు చేసిన హెచ్చరిక గమనార్హమైనది.

**"విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల (ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మసమ్మతం కాదు." (ఖుర్ఆన్-4:19)**

మేడమ్! ఓసారి మీరు భార్యల పట్ల పురుషుల ప్రవర్తన విషయమై బాధ వెలిబుచ్చారు. ముఖ్యంగా పురుషుడు తన భార్యను ఇష్టపడని పరిస్థితిలో. "A gentleman is a man who can disagree without being disagreeable." (తన మాటలు అనంగీకార యోగ్యమైనవిగా కనబడకుండా తన అనంగీకారాన్ని వ్యక్తపరచేవాడు పెద్ద మనిషి). కాని ఈ పెద్ద మనుషులు తమ భార్యల పట్ల అయిష్టత ఉన్నప్పుడు ఆగ్రహాన్ని ఆపుకోలేరు. సహనాన్ని చూపలేరు. ఇలాంటి పరిస్థితిలో మనిషికి మార్గంచూపే దైవాజ్ఞ ఏదైనా ఉందా అంటే ఖచ్చితంగా ఖుర్ఆన్‌లో ఉందని చెబుతాను నేను. మనిషి తన భార్యపట్ల అయిష్టత కల్గివున్నప్పుడు ఖుర్ఆన్ అతడ్ని హెచ్చరిస్తూ ఇలా పేర్కొన్నది:

**"వారొకవేళ మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చనిదానిలోనే దేవుడు మీకెంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు." (ఖుర్ఆన్-4:19)**

మేడమ్! ఇదంతా చూసి మీరు ఆశ్చర్యపోవచ్చు. దేవుడు స్త్రీలకు మాత్రమే దేవుడా అని భావించవచ్చు. దేవుడు పురుషుడ్ని హెచ్చరిస్తూ అతను ఇష్టపడని భార్యలోనే అతనికి మేలు ఉండవచ్చని చెబుతున్నాడు.

చివరకు ఈ 20వ శతాబ్దిలోనూ పురుషుని అహం శిలాయుగంలో మాదిరిగానే యధాతథంగా ఉంది. పురుషుని దృష్టిలో స్త్రీ ఆధారపడి బ్రతికే జీవి. అంతేగాని పరస్పరం ఒండొరులపై ఆధారపడి ఉన్నామని ఒప్పుకోడు. భార్య సంపాదిస్తున్నప్పటికీ ఇదే పరిస్థితి ఉంటుంది. పురుషుడు తన భార్య సంపాదనపై పూర్తి హక్కు తనకే ఉందనుకొంటాడు. అది తన స్వంత సంపదగా భావిస్తాడు. చివరకు కొందరు భార్యలు తాము సంపాదించిన సొమ్మును ఖర్చుపెట్టడానికి భర్తల అనుమతి తీసుకొనే పరిస్థితి ఉంది.

ఖుర్ఆన్ స్త్రీ సంపాదన ఆమెదేనని స్పష్టంగా ఆదేశించింది.

**"పురుషులు సంపాదించిన దానికి తగినట్లు వారి భాగం ఉంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది." (4:32)**

ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తి మీకు మరింత ఆసక్తి కలిగిస్తుంది.

**"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు." (ఖుర్ఆన్-4:34)**

అంటే పురుషుడు కుటుంబనిర్వహణకు ఖర్చు చేయవలసి ఉంటుంది. కాగా, స్త్రీ సంపాదన ఆమె సొంతం. ఆమె దాన్ని తన కోసమైనా వాడుకోవచ్చు లేదా కుటుంబఖర్చుల కోసమైనా వాడవచ్చు. అది ఆమె యిష్టం.

మేడమ్! ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు సలహా, సిఫారసులు కావు. ఇవి ఆదేశాలు, ఉత్తర్వులు, తప్పించుకోడానికి ఎలాంటి అవకాశం ఇవ్వని స్పష్టమైన



ఆజ్ఞలు. ఈ ఆజ్ఞలకు కట్టుబడడం అన్నది దేవునిపై విశ్వాసంతో అనుసంధానం చేయబడింది. ఎందుకంటే ఖుర్ఆన్ దేవుని వాణి.

మనం ఇప్పుడు ఖుర్ఆన్‌లో పేర్కొన్న స్త్రీ పురుషుల సంబంధం చూద్దాం:

**"ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలు ఉన్నాయి." (ఖుర్ఆన్-30:21)**

పరస్పర అనురాగం, అనుబంధం, గౌరవాదరాలు, ఆప్యాయత అన్ని ప్రేమ, కారుణ్యాలతో ముడిపడి ఉన్నాయి. లైంగికసంబంధం మాత్రమే కాదు. జీవితంలోని సమస్త రంగాల్లో స్త్రీ పురుషులు ఒకరిపైనొకరు ఆధారపడవలసిన భావన ఉంది ఈ సూక్తుల్లో.

స్త్రీపురుషులు ఒకరికినొకరు దుస్తులవంటి వారని ఖుర్ఆన్ వర్ణించింది.

**"వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు." (ఖుర్ఆన్-2:187)**

దుస్తులు మనిషికి సౌకర్యాన్ని, రక్షణను, అలంకరణను ఇస్తాయి. మరోవిధంగా చెప్పాలంటే పురుషుడు సుగుణవతి అయిన భార్యను కలిగి ఉంటే మంచి దుస్తులు ధరించి పూర్తి ప్రయోజనాలు పొందినవాడవుతాడు. అదేవిధంగా స్త్రీలు కూడా.

"భార్యలు, కుటుంబసభ్యుల పట్ల మృదువుగా మెలగడమన్నది తప్పనిసరి విధి మాత్రమే కాదు, ఇది విశ్వాసంలోని ఒక భాగం" అన్నారు దైవప్రవక్త ముహమ్మద్ (స). ఇంకా ఆయన ఇలా అన్నారు :

1. విశ్వాసులలో తమ కుటుంబాల పట్ల మృదువుగా, దయతో వ్యవహరించేవారు ఉత్తమ విశ్వాసాన్ని కలిగిఉన్నవారు.
2. తమ భార్యల పట్ల దయతో మెలిగేవారే మీలో ఉత్తములు.
3. స్వర్గం తల్లి పాదాల చెంత ఉంది.

మేడమ్! మీరు నిరంతరం సత్యాన్వేషణకై పరితపించే జిజ్ఞాస గలవారని నా అభిప్రాయం. మీ తపనకు సమాధానమిచ్చే ఇస్లాం జ్ఞానంలోకి ప్రవేశించండి. ఈ తపనను చల్లారనీయకండి.

భవదీయుడు
**అబ్దుల్లా అడియార్**

## శ్రీమతి బ్లాసమ్‌కు రెండవ ఉత్తరం

శ్రీమతి బ్లాసమ్ గారికి,

మీకు శాంతి కలుగుగాక!

మీరు బాట్లగొండ చర్చిని సందర్శించి వచ్చారు. శిశువు క్రీస్తు మీ సమస్యలను పరిష్కరించే శక్తి గలవాడని భావించి వెళ్ళారు. అంతేకాక మీరు అనేక ఇతర సమస్యల విషయమై కూడా మానసిక ప్రశాంతత కోరి వెళ్ళారు.

ఇస్లాం ప్రకారం జీసస్ (శిశువు) దేవుడు కాదు, అన్ని సమస్యలు పరిష్కరించే దైవం కాదు. ఆయన దైవప్రవక్తలలో ఒకరు. ఆయన జీవిత కాలంలో దేవుని అభీష్టం ప్రకారం మహిమలు ప్రదర్శించారు.

దివ్యఖుర్ఆన్ జీసస్ గురించి తెలిపిన వివరాల ప్రకారం,

**"ఆయన ఒక దైవదాసుడు తప్ప మరేమీ కాదు." (43:57)**

**"ఆయన దైవసందేశహరుడు మాత్రమే." (5:75)**

శిశువు జీసస్ గురించి దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది :

**"ఆ పిల్లవాడు ఇలా మాట్లాడాడు: 'నేను దేవుని దాసుడ్ని. ఆయన నాకు దివ్యగ్రంథం ప్రసాదించాడు. ప్రవక్తగా నియమించాడు." (19:30)**

**"మర్యం కుమారుడు మసీహ్ దైవప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. అతని తల్లి సౌశీల్య మూర్తి అయిన స్త్రీ. వారిద్దరూ (అందరిలాగే) అన్నం తినే మనుషులే." (5:75)**



దేవునికి ఆకలి ఉండదు, దప్పిక వేయదు. పైగా జీసస్, మేరీలు మరణించారు.

**""దేవుడు గనక మర్యం కుమారుడు మసీహ్‌ని, అతని తల్లిని, భూలోకం లోని వారందర్నీ చంపదలచుకుంటే ఆయన నిర్ణయాన్ని అడ్డుకోగల ధైర్యం ఎవరికైనా ఉందా?" (ఖుర్ఆన్-5:17)**

చివరకు జీసస్ కూడా క్రైస్తవులకు ఇలా హితోపదేశం చేశారు:

**"దేవుడే నా ప్రభువు, మీ ప్రభువు కూడా. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఇదే సన్మార్గం." (ఖుర్ఆన్-43:64)**

కాబట్టి శిశువు జీసస్‌గాని, ఆయన తల్లిగాని ముస్లిములైన స్త్రీపురుషులకు దేవుళ్ళు కారు, కాలేరు.

మీరు విశ్వాస సద్వచనం (కలిమా) పఠించదలిచితే ఇస్లామీయ ధార్మిక విశ్వాసానికి దృఢంగా కట్టుబడాలి. ధార్మిక విశ్వాసం కేవలం అల్లాహ్ మాత్రమే దేవుడు, రక్షకుడు అని ఇస్లాం బోధిస్తుంది.

**"విశ్వసించిన వారికి అల్లాహ్ మాత్రమే కాపాడే స్నేహితుడు. ఆయన వారిని చీకట్ల నుంచి వెలుగులోకి నడిపిస్తాడు." (2:57)**

**"అల్లాహ్ మాత్రమే ఏకైక రక్షకుడు." (42:9)**

**"మిమ్మల్ని అన్ని బాధల నుంచి కాపాడేవాడు అల్లాహ్‌యే." (6:64)**

**"అల్లాహ్ మాత్రమే సంరక్షకుడు, సహాయకుడు." (22:78)**

మేడమ్! మీరు మీ సమస్యలకు పరిష్కారం, శాశ్వత సాఫల్యం కోరుతుంటే అల్లాహ్‌ను మాత్రమే తగిన పరిశుద్ధత (వుజూ)తో ఆరాధించండి.

**"అల్లాహ్ కోరితే ఆయన తన అనుగ్రహంతో మిమ్మల్ని సంపన్నులు చేయడం అసంభవం కాదు." (9:28)**

కాబట్టి అల్లాహ్‌ను ఆరాధించడం ద్వారా ఆయన ప్రసాదించే సంపద పొందమని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. మీతో నా పరిచయమంతా ఇదే అంశంపై కేంద్రీకృతమై ఉంది. నేను చాలా కాలంగా దీన కోసమే ఎదురు చూస్తున్నాను.

మీరు ఏమాత్రం సంకోచించకండి, భయపడకండి, ధైర్యంగా నిర్ణయం తీసుకొండి. అధైర్యాన్ని మించి మనిషిని కబళించేది మరేదీ లేదు. ధైర్యంగా పనిచేసే వారిదే విజయం. 'బియర్స్' తన పుస్తకం 'డెవిల్స్ డిక్షనరీ'లో చెప్పినట్లు "ప్రమాదకరమైన ప్రయాణంలో ఉన్నవాడు కాళ్ళతో ఆలోచిస్తాడు."

ధైర్యం అన్నది మనస్సు, శరీరానికి రెంటికీ సంబంధించినది. ఎమర్సన్ చెప్పినట్లు "భయం అన్నది ఎల్లప్పుడు అజ్ఞానం నుంచి పుడుతుంది."

మేడమ్! మీరు జ్ఞానం కలిగిన మహిళ. మీరు మీ జ్ఞానసంపదను ఉపయోగించండి. ఆచరణలో పెట్టిన జ్ఞానం, ఆచరణలో లేని జ్ఞానం కంటే ఎంతో శక్తిమంతమైనది.

అల్లాహ్ పట్ల విశ్వాసముంచండి. ఆయన విశ్వసించినవారిని, సత్కార్యలు చేసేవారిని కాపాడుతాడు. వారికి తప్పనిసరిగా లభించే ప్రతిఫలం ఉంది.

మద్రాస్ భవదీయుడు,
19-8-1990. **అబ్దుల్లా అడియార్**

# హిందువులకు పిలుపు

## శంకరాచార్యకు లేఖ

శ్రీ కంచి శంకరాచార్యుల వారికి,
కంజీపురం.
గౌరవనీయులైన శంకరాచార్య స్వామిగల్!
మీకు శాంతి కలుగుగాక.



నేను పాకిస్తాన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత మీకు 'భగవద్గీత' బహూక రించాను. పాకిస్తాన్‌లోని హిందువులు అచ్చువేయించిన భగవద్గీత అది.

మీరు ఆశ్చర్యపడుతూ, హిందూ గ్రంథాలలో ఎక్కడైనా ఇస్లామ్ గురించి, ముహమ్మద్ ప్రవక్త గురించి ప్రస్తావన ఉందా అని నన్ను ప్రశ్నించారు.

హిందూగ్రంథాల నుంచి కొన్ని కొటేషన్లు మీకీ లేఖలో రాస్తున్నాను.

## హిందూ గ్రంథాల్లో భవిష్య సూచనలు

హిందూ గ్రంథాల్లో దైవప్రవక్త ముహమ్మద్ (స) గురించి అనేక సూచనలు ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సూచనలు పురాణాల్లో ఉన్నాయి. భవిష్య పురాణంలో ఉన్న సూచన అన్నింటికన్నా స్పష్టంగా ఉంది. ఇందులో దైవప్రవక్త ముహమ్మద్ (స) పేరు, దేశం అన్ని వివరాలు ఉన్నాయి- మరుస్థలే నివాసినాం -ఎడారి నివాసి. (అరేబియా). ఈ కారణం వల్లనే ఆర్యసమాజ్ ఈ పురాణంపై సందేహాలు వ్యక్తం చేసింది. ఈ పురాణంలో ముహమ్మద్ ప్రవక్త (స) ప్రస్తావన ఉంది. కాబట్టి ఈ పురాణం నమ్మశక్యమా అన్నది వారి వాదన. అయితే సనాతన పండితులు, అనేకమంది హిందువులు ఈ పురాణం నమ్మశక్యమైనది గానే భావిస్తున్నారు.

సంస్కృత శ్లోకం :

**ఏతన్ మిన్నన్తరే మ్లేచ్ఛ ఆచార్యేణ సమన్వితః**

**మహామద ఇతిఖ్యాతః శిష్య శాఖా సమన్వితః** ॥ ౫ ॥

**నృపశ్చైవ మహాదేవం మరుస్థల నివాసినమ్.....**

అనువాదం : ఒక మ్లేచ్ఛుడు (అంటే విదేశీయుడు, విదేశీ భాష మాట్లాడువాడు), ఆధ్యాత్మిక గురువు తన శిష్యులతో సహా అవతరిస్తాడు. ఆయన పేరు ముహమ్మద్. రాజా (భోజుడు) దేవదూతల వలే కనిపించే అరబ్బు మహాదేవునికి పంచగవ్య స్నానాన్ని, గంగాజల స్నానాన్ని చేయించిన పిదప తన భక్తిప్రపత్తులను సమర్పిస్తూ గౌరవపూర్వకంగా "నేను మీకు విధేయత

చూపుతున్నాను" అన్నాడు. "మానవజాతికి గర్వ కారణమైనవాడా, అరేబియా నివాసి, రాక్షసులను సంహరించే అపారశక్తి కలిగినవాడవు. మ్లేచ్ఛ శత్రువుల ప్రమాదం నుంచి రక్షణ పొందినవాడవు. నీవు అత్యున్నత దేవుని ప్రతిబింబానివి. నేను నీకు బానిసను. నన్ను మీ చరణాలలో స్వీకరించండి.

మహాప్రవక్త ముహమ్మద్ (స) స్తోత్రం ఇది. ఇందులో మహర్షి వ్యాసుడు క్రింది అంశాలను పేర్కొన్నాడు.

(1). మహాప్రవక్త పేరు ముహమ్మద్ (మహమద్) అని పేర్కొనబడింది.

(2). ఆయన అరేబియా దేశానికి చెందినవాడని చెప్పబడింది. శ్లోకంలో ఉన్న 'మరుస్థల్' అన్న సంస్కృత పదానికి అర్థం ఎడారి భూమి అని అర్థం.

(3) ప్రవక్త అనుచరుల గురించి ప్రత్యేక ప్రస్తావన ఉంది. మహాప్రవక్త (స) మాదిరిగా ఆయనలానే కనబడే అనేకమంది అనుయాయులు కలిగివున్న ప్రవక్త మరొకరు ఎవరూ ప్రపంచంలో లేరు.

(4) ఆయన పాపరహితుడు, దైవదూతలా కనిపించేవారు.

(5) భారతదేశానికి చెందిన రాజు ఆయన పట్ల అపార గౌరవాదరాలు చూపుతాడు.

(6) శత్రువుల నుంచి ప్రవక్త (స)కు భద్రత కల్పించడం జరుగుతుంది.

(7) ఆయన రాక్షసులను సంహరిస్తాడు. విగ్రహారాధనను నిర్మూలిస్తాడు. అన్ని విధాల చెడులను తొలగిస్తాడు.

(8) మహర్షి తనను తాను ఆయన పాదాల వద్ద సమర్పించుకుంటాడు.

(9) ఆయన అపార శక్తిశాలి అయిన దైవానికి ప్రతిబింబంలా ఉంటాడు.

(10) ఆయన మానవాళికి గర్వకారకుడుగా పరిగణించబడతాడు. (ప్రచాతిస్‌నాథ్)

(భవిష్యపురాణం, పర్వం:3, ఖండం:3, అధ్యాయం:3, శ్లోకం: 5-8)



సంస్కృత శ్లోకం- 2

**ఇదం జనా ఉపశ్రుత నరాశం సస్తవిష్యతే**

**షష్టిం సహస్రానవతిం చ కౌరుమ్ ఆ రుశమేషు దద్మహే** ॥౧॥

**ఉష్ట్రాయస్య ప్రవాహిణో వధూమన్తో ద్విర్దశ**

**వర్ష్మా రథస్యని జిహీడతే దిన ఈషమాణా ఉప స్పృశః** ॥౨॥

**ఏష ఇషాయ మా మహే శతం నిష్కాన్ దశ స్రజః**

**త్రీణి శతాస్య ర్వతాం సహస్రా దశ గోనామ్** ॥౩॥

అనువాదం : "ప్రజలారా! శ్రద్ధగా వినండి! స్తుతించదగిన మనిషి (ముహమ్మద్) ప్రజలలో అవతరింపజేయబడతాడు. ప్రవాసిని మేము మా ఆశ్రమంలో తీసుకొంటాము. ఆయన్ని అరవై వేల తొంభైమంది శత్రువుల నుంచి మా ఆశ్రమంలో తీసుకొంటాము. వారి వాహనాలు ఇరవై ఆడ మగ ఒంటెలు. ఆయన ప్రతిష్ఠ స్వర్గాన్ని అధిగమిస్తుంది.

ఆయన మహర్షికి వంద బంగారు నాణాలు ఇస్తారు. పది వృత్తాలు ఇస్తాడు. మూడు వందల అరేబియా గుర్రాలు, పదివేల ఆవులు ఇస్తాడు."

(అధర్వణవేదం, కాండం-20, శ్లోకం-127, మంత్రం:1-3)

పాకిస్తాన్‌కు చెందిన 'భవాని వక్స' ప్రచురించిన "The First and Final Religion" లో ఈ సంస్కృత శ్లోకాలు ఉన్నాయి.

భవిష్యపురాణంలో చాలామందికి తెలియని శ్లోకాలు కొన్ని ఉన్నాయి.

**లింగచ్ఛేది శిఖాహీనః శ్మశ్రుధారిన దూషకః**

**ఉచ్చలాపీ సర్వభక్షీ భవిష్యతి జనోమమ**

**..............................................**

**ముసలైనైన సంస్కారః ........**

(భవిష్యపురాణం, భాగం-3, శ్లోకం-25-27, సూత్రం-3)

అనువాదం : "వారు 'ఖత్నా' (సున్నత్) చేయించుకొంటారు. శిరో ముండనం చేయిస్తారు. గడ్డాలు ఉంటాయి. మాంసాహారులు. వారు ఆరాధనకు పిలిచే పిలుపు బిగ్గరగా ఉంటుంది. భవిష్యత్తులో వారు 'ముసలై' అని పిలువబడతారు."

రుగ్వేదంలో ముహమ్మద్ (స) ప్రస్తావన "మహామహె" అని వచ్చింది. (మంత్రం–5, సూక్తం–28) రుగ్వేదం హిందువుల అతి ప్రాచీన గ్రంథం.

కాబట్టి, దైవప్రవక్త హిందూ గ్రంథాల్లో ప్రస్తావించబడిన ప్రవక్త (స). అంతేకాదు, దేవుని ఏకత్వం తర్వాత ప్రస్తావన ఉన్న ఒకే ఒక ప్రవక్త (స) ఆయన.

ఉపనిషత్తుల సందేశం 'పరబ్రహ్మం' అంటే దివ్య ఖుర్ఆన్‌లోని అల్లాహ్ తప్ప మరేమీ కాదు. కాబట్టి నేను మిమ్మల్ని ఈ వాస్తవాలు లోతుగా అధ్యయనం చేయమని, దేవుని ఏకత్వాన్ని గ్రహించమని కోరుతున్నాను.

– భవదీయుడు
**అబ్దుల్లా అడియాం**

# దళితులకు పిలుపు

## ఇలయ పెరుమాల్‌కు ఉత్తరం

(కలైమామని అబ్దుల్లా అడియార్, తిరు ఇలయ పెరుమాల్‌కు రాసిన బహిరంగ లేఖ యిది. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు షెడ్యూల్డ్ కులాలపై అణచివేతల గురించి ఒక నివేదిక సమర్పించిన దళిత నాయకుడు పెరుమాల్)

ప్రియ సోదరునికి!

మీకు శాంతి కలుగుగాక!

ఇటీవల మనం శివకాశీ, టూరిజం బంగ్లాలో కలుసుకొన్నప్పుడు నేను మీ అభిప్రాయాలు కొన్ని గ్రహించగలిగాను.



ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాలుగా పరిగణింపబడుతున్న అంటరాని ప్రజల పూర్తి సమాజం వేలాది సంవత్సరాలుగా పేదనకు గురవుతోంది. తగిన విద్యావకాశాలు, ప్రతిష్ఠ, గౌరవంగా బ్రతికే పరిస్థితులు ఏవీ వారికి లభించడం లేదు. మీరు ఈ ప్రజల బతుకులు బాగు చేయడానికి నిద్రాహారాలు మాని శ్రమిస్తున్నారన్నది నాకు తెలుసు.

దేశంలో ఏ ప్రాంతంలోనైనా సరే, షెడ్యూల్డ్ కులాలు– వారి మతం ఏదైనా– రెండవ తరగతి ప్రజలు గానే చూడబడుతున్నారు. అంతేకాదు,

▲ వారు కష్టించి పనిచేసే స్వభావం గలవారు.

▲ వారు ఈ నేల పుత్రులు.

▲ ఎండల్లో మలమల మాడుతున్నారు.

▲ వారి చెమటవాసనే వారికి సువాసన.

▲ వారు ఉత్పత్తికి ముఖ్య కారకులు.

గ్రామాల్లో, పట్టణాల్లో, ఫ్యాక్టరీల్లో, అగ్రవర్ణాలు శారీరక శ్రమ తప్పించుకోగా ఈ ప్రజలు చెమటోడ్చి పనిచేస్తున్నారు.

చెత్తచెదారం, మృతదేహాల దుర్వాసనకు భయపడి అందరూ దూరంగా ఉండగా కేవలం షెడ్యూల్డ్‌కులాల ప్రజలే ముందుండి డ్రెయినేజీలు, టాయిలెట్లు శుభ్రం చేయడం, మృతదేహాలను, కుళ్ళిన దేహాలను తొలగించడం వంటి పనులు చేస్తున్నారు. ఈ తప్పనిసరి పనుల నుంచి వారికి స్వేచ్ఛ అవసరం.

ఈ లక్ష్యం సాధించాలంటే, ఈ ప్రజలకు విద్య అవసరం. అందుకే డా. అంబేద్కర్ రాత్రింబవళ్ళు శ్రమించి కృషి చేశారు. ఆయన కృషివల్లనే ఈ ప్రజలకు విద్యాసంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రవేశం లభించింది.

అయితే దీనివల్ల ప్రతికూల ప్రభావం కూడా పడింది. చదువులు చదివి, డిగ్రీలు పొంది ఉద్యోగాలు సాధించుకొన్న వాళ్ళు స్వార్థంతో వ్యవహరిస్తూ, తమ తోటి దళితులకు దూరంగా ఉండడం మొదలయ్యింది.

వీళ్ళు తమదైన ప్రత్యేక పరిధి సృష్టించుకొని తోటి దళితుల్ని, అణచివేత భారం మోస్తున్నవారిని ఆదుకోవాలన్న బాధ్యత మరిచారు. తాము సాధించింది అంతా వ్యక్తిగతంగా సాధించుకున్నదే అన్న స్వార్థ భావనలో మునిగిపోయారు.

కొందరు ప్రజలు వరదల్లో కొట్టుకుపోతే, వారిని రక్షించడానికి కొందరు పూనుకొని కాపాడితే అలా రక్షించబడినవారు, ఆ పిదప తమలా నీట మునుగుతున్న వారిని కాపాడడం కనీస కర్తవ్యం. కాని, అందుకు విరుద్ధంగా వరదల నుంచి కాపాడబడినవారు, తమ తోటి సోదరులు మునిగిపోతున్నా పట్టించుకోకుండా ముఖం దాచుకొంటున్నారు. ఎంత క్రూరం! ఎంత స్వార్థం! – గత కాలాల్లో జరిగింది ఇదే.

అనేక సదుపాయాలు, సౌకర్యాలు వారికి కల్పించబడ్డాయి. ప్రతిష్ఠాత్మక హోదాలు, ఎం.ఎల్.ఏ., ఎం.పీ. స్థానాలు వారికి కేటాయించబడ్డాయి. అంటరానితనాన్ని నిర్మూలించే చట్టాలు చేయబడ్డాయి.

ఇన్ని సదుపాయాలు, శాసనబద్ధ ఆరక్షణలు, రక్షణలు ఉన్నప్పటికీ ఈ ప్రజలు అభివృద్ధి సాధించారా? ఇతరులతో సమానస్థాయి పొందగలిగారా? లేదు. వారిని కించపరిచే, న్యూనపరిచే ధోరణులు సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. అయితే మౌలిక సత్యాలు యేవి?

- ◆ ప్రభుత్వం వారిని గుర్తించింది!
- ◆ విద్యా సంస్థలు వారిని ఆహ్వానిస్తున్నాయి!
- ◆ చట్టాలు వారికి అనుకూలంగా ఉన్నాయి!
- ◆ కాని (అగ్రవర్ణ) సమాజం వారికి అనుకూలంగా లేదు.

ఇక్కడ గమనించదగిన అంశం ఏమంటే, పూర్వకాలంలో కించపరచడం, హీనపరచడం అన్నది బహిరంగంగా జరిగేది. బహిరంగంగా అందరి ముందు వారిని తిట్టడంజరిగేది. అంటే అవమానాలు, పరాభవాలు ప్రత్యక్షంగా ఉండేవి. కాగా, ఇప్పుడు ఈ అవమానాలు పరోక్షరూపంలో ఉన్నాయి. పరాభవాలు ప్రస్తుతం బయటపడని విధంగా జరుగుతున్నాయి.



అయితే ఈ అణచివేత పరాభవాలను ప్రతిఘటించడం జరిగితే వెంటనే అత్యాచారాల పర్వం మొదలవుతుంది. అవమానాలు, పరాభవాలు బహిరంగ మవుతాయి. ఆ విధంగా ప్రస్తుతం దళితులకు లభిస్తున్న సదుపాయాలు ఉద్యోగ అవకాశాలు, చట్టబద్ధ రక్షణలు– ఇవన్నీ నిజానికి దళితుల మౌలిక అవసరాలు. అంతే తప్ప సమాజంలో ఇతరులతో సమానత్వానికి సూచనలు కావు.

గతంలో దళిత ప్రజలు మురికి దుస్తులు మాత్రమే ధరించగలిగేవారు. బహిరంగంగా అవమానాలు ఎదుర్కొనేవారు. కాగా ప్రస్తుతం శుభ్రమైన దుస్తులు ధరించి, తెరచాటున జరిగే అవమానాలు భరిస్తున్నారు. ఈ సామాజిక అణచివేతను వారు తొలగించవలసి ఉంది.

అనేక పరిష్కారాలు ఈ విషయమై ప్రతిపాదించబడుతున్నాయి. అనేక సలహా సూచనలు వినబడుతున్నాయి.

1. హిందూమతంలోనే ఉండి ఈ అన్యాయాలను ప్రతిఘటించడం.
2. అందుగ్గాను రాజకీయ ఉద్యమాలలో చేరడం.
3. సారూప్యభావాలు కలిగిన కమ్యూనిస్టు పార్టీ వంటి పార్టీలలో చేరడం.
4. కోల్పోయిన ప్రతిష్ఠను మళ్ళీ సాధించుకోడానికి క్రైస్తవ, బౌద్ధ మతాలను స్వీకరించడం.
5. ఇస్లాం స్వీకరించి ఈ అణచివేతల వాతావరణాన్ని రూపుమాపడం.

ఈ అయితే పరిష్కారాలను పరిశీలించి, విశ్లేషించి సమస్యకు తగిన పరిష్కారం యేదో చర్చించడం ఈ లేఖ ముఖ్యోద్దేశం.

హిందూమతం పరాభవాలను నిర్మూలించడానికి తోడ్పడుతుందా?

హిందూమతం పట్ల మాలో ఎలాంటి మతతత్వ వ్యతిరేకత లేదన్న విషయాన్ని ముందుగా స్పష్టం చేస్తున్నాను. కేవలం సమస్యను తార్కికంగా పరిశీలించడమే ముఖ్యోద్దేశం.

కుల వ్యవస్థను ఈ దేశంలో ఏర్పరచి అణగారిన ప్రజలను సృష్టించింది హిందూమతమే. ఆ అణగారిన ప్రజలను శూద్రులని పిలిచేవారు. ప్రస్తుతం వీరిని షెడ్యూల్డ్‌కులాలు అంటున్నారు. ఈ పేరు కాస్త మెరుగైన ప్రత్యామ్నాయం, కాలం మారింది. కాబట్టి పేరు మారింది. అయినప్పటికీ నేటికీ కొందరు ఛాందసులు ఈ ప్రజలను "పరిజమర్గల్" అనే పిలుస్తున్నారు.

మానవజాతిలో విభిన్న తరగతులు ఉండడం అన్నది ఒక అంతర్జాతీయ వాస్తవం. ప్రపంచంలోని ఇతర దేశాల్లో వృత్తిరీత్యా విభజనలున్నాయి. శరీర వర్ణం దానికి కొంతవరకు కారణం. కాని హిందూమతంలో ఈ విభజనలు పుట్టుక ప్రాతిపదికన ఉన్నాయి. అంతేకాదు, హిందూవేదాల ప్రకారం ఈ విభజనలన్నవి ప్రపంచం ఏర్పడినపుడే ఉనికిలోకి వచ్చాయి.

ఒక వేదం (రుగ్వేదం)లోని పదవ అధ్యాయంలో అంటే 'పురుష సూక్తం' లో క్రింది పంక్తులు కనబడతాయి.

అమర్త్యుడైన (చావులేని) మహాశక్తిమంతుడు, వేయి శిరస్సులు, వేయి కళ్ళు, వేయి కాళ్ళు కలిగిన 'పురుష' నుంచి ప్రపంచంలోని జీవులన్నీ పుట్టాయి.

బ్రాహ్మలు శిరస్సు నుంచి, క్షత్రియులు భుజాల నుంచి, వైశ్యులు తొడల నుంచి జన్మించారు. శూద్రులు కాళ్ళ నుంచి జన్మించారు.

రుగ్వేదంలోని ఈ అధ్యాయం కేవలం మానవాళి పుట్టుక గురించి మాత్రమే కాదు, విశ్వం ఏర్పడిన క్రమాన్ని కూడా క్రింది విధంగా పేర్కొంది.

✦ మనసు నుంచి చంద్రుడు.

✦ కళ్ళ నుంచి సూర్యుడు.

✦ నోటి నుంచి అగ్ని.

✦ శ్వాస నుంచి వాయువు.

✦ శిరస్సు నుంచి ఆకాశం.

✦ కాళ్ళ నుంచి భూమి.



ఇండో ఆర్యన్లు నాలుగు వర్ణాలు గల సమాజాన్ని ఏర్పరచి ఒక శాశ్వత సాంఘిక చక్రాన్ని రూపొందించారు.

ఆ పిదప కాలాల్లో వచ్చిన ధార్మిక ఆదేశాలేవీ ఈ వ్యవస్థను వ్యతిరేకించ లేదు. పైగా సమర్థించాయి. చివరకు భగవద్గీత కూడా సమర్థించింది.

పురోహితులు, రాజులు, వర్తకులు, సాధారణ జనులు ఇలా కొన్ని తరగతులు ప్రపంచంలోని వివిధ సామాజాల్లో ఉన్నాయి. ఏవ్యక్తి ఏ తరగతికి తగిన శక్తి కలిగిఉంటే ఆ తరగతిలో ఉంటాడు.

కాని, ఈ తరగతులకు శాశ్వత ప్రాతిపదికన వేదాల్లోని పురుష సూక్తం కల్పించింది. సాంఘీకంగా ఈ తరగతుల వ్యవస్థను గ్రీకు తత్వవేత్త ప్లేటో కూడా ఊహించాడు. కాని అతడి ఊహావ్యవస్థకు అక్కడ ధార్మిక పునాది లేదు. కాగా భారత దేశంలో ఈ తరగతులకు వేదాల ఆమోదముద్ర ఉంది. ఈ దేశంలోని ధార్మిక ఆదేశాలు ఈ విభజనను ఆమోదిస్తాయి. రుగ్వేదాన్ని అనుసరించే ధార్మిక సాహిత్యం యావత్తు ఈ విభజనను అంగీకరిస్తుంది.

హిందూ గ్రంథాలలోని తైత్తరేయబ్రాహ్మణం ప్రకారం శూద్రులు రాక్షసుల నుంచి వచ్చారు. అంతే తప్ప మరేమీ కాదు. ఈ విభజనలు, తారతమ్యాలు చట్టాలు-నేరాల శిక్షల విషయంలోనూ ప్రతిఫలించాయి. ఈ క్రింది పంక్తులు ఆ విషయాన్ని చెబుతాయి.

❖ బ్రాహ్మణుల నుంచి గ్రహించిన పాలను శూద్రులు తాగరాదు- (మైత్రేయ బ్రాహ్మణం-3:38)

❖ హోమాగ్నిని రగిలించినప్పుడు శూద్రులు అక్కడ ఉండరాదు- (సుధార సంహిధా-10:10)

❖ పానీయం (మదిర) త్రాగుతున్నప్పుడు శూద్రులకు ప్రవేశం లేదు- (సుధార సంహిధా-10:10)

❖ శూద్రులు ఎల్లప్పుడు ఇతరులకు సేవకులు. (ఐత్తరేయ బ్రాహ్మణం- 29:4)

అబస్తంభ ధర్మం, వైష్ణవాదమ ధర్మం, విష్ణుస్మృతి వంటివి కూడా ఉన్నాయి. అన్నింటా కుల విభజనకు సమర్థన ఉంది.

ఈ సందర్భంగా మనుస్మృతి కూడా ప్రస్తావించదగింది. మనుస్మృతి ప్రకారం బ్రాహ్మలు బ్రహ్మముఖం నుంచి, క్షత్రియులు బ్రహ్మభుజాల నుంచి, వైశ్యులు బ్రహ్మతొడల నుంచి, శూద్రులు బ్రహ్మకాళ్ళ నుంచి జన్మించారు.

ఒక నేరానికి శిక్షలు కూడా వివిధ రీతుల్లో ఉన్నాయి. బ్రాహ్మలకు చాలా తక్కువ శిక్ష, క్షత్రియులకు, వైశ్యులకు మామూలు స్థాయి శిక్ష, శూద్రులకు కఠిన శిక్షలు చెప్పబడ్డాయి.

ఉదాహరణకు, ఇతర జాతికి చెందిన మహిళ మానభంగానికి గురయితే, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో ఎవడయినా నేరస్తుడయితే సమాజ బహిష్కరణ శిక్ష కాగా, శూద్రుడు ఈ నేరం చేస్తే మరణ శిక్ష.

శూద్రుడు బ్రాహ్మణ స్త్రీని చెరిస్తే అతడి పురుషావయవం ఖండించడం, అతడి ఆస్తులు జప్తు చేయడం శిక్ష. శూద్రులకు వేదాధ్యయనం చేసే అర్హత లేదు. వాళ్ళు ఇతరులతో కలువరాదు. వారికి ఆర్థిక అభివృద్ధి సాధించే అవకాశాలు లేవు. వాళ్ళు కేవలం సేవకులుగానే ఉండాలి.

ఈ విధంగా కొన్ని వర్గాలకు కఠిన శిక్షలు విధించకుండా నిబంధనలు ఉన్న చట్టాలు రోమన్ పాలనాకాలంలో, క్రైస్తవ పాలనా కాలంలో, యూద రాజుల పాలనలోనూ ఉండేవి.

రోమన్ చట్టాల ప్రకారం ప్రజలు అయిదు తరగతులుగా విభజించ బడ్డారు. తమవారికి, తమపై ఆధారపడిన వారికి సౌలభ్యాలు, సదుపాయాలు ఇస్తూ, ఇతరులు, విదేశీయులకు కఠిన శిక్షలు విధించేవారు.

అలాగే క్రైస్తవ పాలనలోనూ, క్రైస్తవులందరికీ సదుపాయాలు, సౌలభ్యాలు ఉండేవి. యూదులకు ఎలాంటి సౌలభ్యాలు ఇచ్చేవారు కాదు. అలాగే యూదు రాజులు కేవలం యూదులకు మాత్రమే సౌలభ్యాలు కల్పించి ఇతరులకు నిరాకరించారు.



అయితే హిందూమతంలోని చేదునిజం ఏమంటే ఈ మతానికి చెందిన వారే అయిన ఒక తరగతి ప్రజలపట్ల తీవ్ర కాఠిన్యాన్ని ప్రదర్శించడం జరిగేది.

చతుర్వర్ణ వ్యవస్థ అన్నది ఒక దృఢమైన సాంఘిక నిర్మాణం కోసం ఉద్దేశించిందని మాట వరసకు అనుకున్నప్పటికీ, ఈ విభజన వ్యవస్థయే సమాజ చట్రాన్ని ఛిన్నాభిన్నం చేస్తుందన్న నిజాన్ని ఎలా కాదనగలం? బ్రాహ్మణులకు లభించిన ప్రత్యేక హోదా, హక్కులు ఇతర వర్గాల్లో అలజడిని రేకెత్తించాయి. ఈ విషయాన్ని క్రింది పంక్తుల్లో చూడగలం.

“యావత్‌ప్రపంచం దేవునితో అంతమవుతుంది. దేవుడు మంత్రబద్ధుడు. మంత్రాలన్నీ బ్రాహ్మల వద్ద ఉన్నాయి. కాబట్టి బ్రాహ్మలే మన దైవాలు.”

ఇలాంటి సిద్ధాంతాల వల్లనే హిందువులలోని నిమ్న వర్గాలు తిరగబడడం, మతం విచ్ఛిన్నం కావడం జరిగింది. ఈ విభజనల పర్యవసానంగానే జైన మునులు, గౌతమ బుద్ధుడు హిందూమతానికి వ్యతిరేకంగా తమవైన కొత్త మతాలు స్థాపించుకున్నారు. ఏది ఏమైనా కులవ్యవస్థను స్థాపించింది హిందూమతం అన్నది వాస్తవం. ఈ వ్యవస్థను వ్యతిరేకించినవారు వేరుపడి తమదైన కొత్తమతాన్ని స్థాపించుకున్నారు. వారు హిందూమతంలో ఉండి కులవ్యవస్థను ప్రతిఘటించలేకపోయారు, మతాన్ని సంస్కరించలేకపోయారు. వేరుపడి కొత్తమతం స్థాపించుకోవడం వారికి తప్పనిసరి అయ్యింది.

## ఆధునిక కాలంలో పరిస్థితి

అనేక మార్పులు వచ్చినప్పటికీ, ఆధునికభావాలు, ఆధునిక వాదాలు తలెత్తుతున్నప్పటికీ, హిందూమతం తన సొంత ప్రబలమయిన షెడ్యూల్డ్ కులాలకు గౌరవప్రదమైన స్థానం ఇవ్వడానికి సిద్ధంగా ఉందా? సుదూర భవిష్యత్తులో అయినా అలాంటి సూచనలు ఉన్నాయా?

సైద్ధాంతికంగా సాధ్యమే కావచ్చు కాని ఆచరణాత్మకంగా అసాధ్యం. దళితులకు సమాన ప్రతిపత్తి ఇవ్వడంపై వ్యతిరేకతలు బహిరంగంగా బయట పడకపోవచ్చు. కాని లోలోన వ్యతిరేకతలు బుసకొడుతూనే ఉంటాయి.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కులం గోడలు మరింత దృఢంగా ఉన్నాయి. ప్రభుత్వం కూడా గృహనిర్మాణాల విషయంలో పక్షపాతం చూపుతోంది. అగ్ర వర్ణాలకు చక్కని ఇళ్ళు కట్టివ్వడం, షెడ్యూల్డ్ కులాలకు అగ్గిపెట్టెల్లాంటి ఇళ్ళు కట్టివ్వడం జరుగుతోంది. ఊళ్ళలో హోటళ్ళలో దళితులకు వేరుగా వడ్డిస్తారు. వారి గ్లాసులు, పళ్ళాలు వేరుగా ఉంచుతారు. కోయంబత్తూర్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లోని స్కూళ్ళలో ఒక తరగతి చదువుతున్న విద్యార్థుల్లో షెడ్యూల్డ్‌తరగతుల విద్యార్థుల న్యూనతాభావం కలిగిఉండడాన్ని నేను చూశాను. హాస్టళ్ళలో భోజనం చేసేటప్పుడు, గదుల్లోకి వెళ్ళేటప్పుడు, సెలవుల్లో ఇండ్లకు వెళ్ళేటప్పుడు అన్ని సందర్భాలలోనూ ఈ విభజన కనబడుతుంది. అగ్రవర్ణాలు అన్నం ఇస్తే, నిమ్న వర్ణాలవారు దూరంగా నిలబడి అందుకోవాలి. అగ్రవర్ణాలతో మాట్లాడాలన్నా దూరంగా నిలబడి మాట్లాడుతారు.

ఒక మంత్రి పర్యటన సందర్భంగా, షెడ్యూల్డ్ కులాలవారు చేసిన ఒక విజ్ఞప్తి మనకు దిగ్భ్రమ కలిగిస్తుంది. ఒక స్మశాన స్థలం, అక్కడకు వెళ్ళడానికి దారి కావాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 45 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఒక తరగతి ప్రజలు స్మశానం కోసం, స్మశానానికి వెళ్ళే దారికోసం విజ్ఞప్తులు చేయవలసి వస్తోంది.

హిందూమతం వారిని ఎంత వేరుగా ఉంచిందో దీన్నిబట్టి అర్థమవుతోంది. ఆరెస్సెస్, హిందూఫ్రంట్ మున్నాని తదితర సంస్థలకు చెందిన వారుగాని, ఇతర హిందూనేతలుగాని ఈ విషయం ఏమాత్రం పట్టించుకోరు. కొందరు చదువుకున్న షెడ్యూల్డ్ కులాలవారు తమ హక్కుల కోసం గొంతు విప్పినా ఏం జరుగుతుంది?

ఏవయినా అల్లర్లు, కలహాలు జరిగినపుడు మరణించేవారు, తీవ్రగాయాల పాలయ్యేవారు షెడ్యూల్డ్ కులాల ప్రజలే. ఉదాహరణకు కీలవెన్మని, విల్లుపురం, పుల్యాంగుడి, రాజాపలయం తదితర ప్రాంతాల్లో జాతి కలహాలు జరిగినపుడు బలయ్యింది షెడ్యూల్డ్ కులాల ప్రజలే. ఉత్తర భారతంలో ఇది నిత్యకృత్యం. ఇలాంటి కలహాల్లో మరణించేది షెడ్యూల్డ్ కులాల ప్రజలే.



ఇటీవల కోయంబత్తూర్ జిల్లాలో ఒక దళిత యువకుడు, ఓ అగ్రవర్ణం అమ్మాయిని ప్రేమించినందుకు పట్టపగలు హత్యగావించబడ్డాడు. పోలీసులు ఆ ప్రాంతానికి వచ్చారు. కాని సాక్ష్యాలు లేనందువల్ల కేసు లేకుండా పోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

అనుదినం షెడ్యూల్డ్ కులాల ప్రజలు అవమానాలు, పరాభవాల పాలవుతున్నారు. హత్యలు తరచూ జరుగుతున్నాయి. ఇది అగ్రవర్ణాలకు తమాషా, నిమ్నవర్ణాలకు చావు బతుకుల పోరాటం.

కర్నాటక రాష్ట్రంలోని తలకవాడి గ్రామంలో ఇటీవల జరిగిన ఒక సంఘటనను 'కుముదం' పత్రిక ప్రచురించింది. ఆ పత్రిక కథనం ప్రకారం కొందరు అగ్రవర్ణం యువకులు ఆహార పదార్థాలు తీసుకొని ఒక ఆదివాసి (యస్.సి.) ఇంటికి వెళ్ళారు. అగ్రవర్ణ హిందువులు ఈ చర్యకు మండిపడి ఆ యువకులను హింసించి శిక్షించారు. వారిపై ఆవుమూత్రం పోసి శుద్ధి చేశారు. పైగా జరిమానా కూడా విధించారు.

ఇలాంటి క్రూర సంఘటనలు జరుగుతున్నాయి. షెడ్యూల్డ్ కులాల పట్ల సానుభూతి, జాలి చూపేవారిని హింసించి సమస్యను మరింత జటిలం చేస్తోంది హిందూసమాజం. హిందూమత నాయకులెవరూ ఇలాంటి సంఘటనలు జరుగకుండా నిరోధించడం లేదు. శంకరాచార్యులు, జీయర్‌లు, సాయిబాబాలు, చిన్మయానందలు, మానివేరాలు, మతాధిపతులు చాలామంది ఉన్నారు కాని, ఎవ్వరూ షెడ్యూల్డ్ కులాలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవడం లేదు.

నిజం చెప్పాలంటే, ఈ ప్రముఖుల్లో కొందరు షెడ్యూల్డ్ కులాలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వ్యక్తులకు, సంస్థలకు రాజపూజారులుగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఇలాంటివారితో రహస్య సంబంధాలు కొనసాగిస్తే మరికొందరు బహిరంగ సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఎందుకంటే సాంఘిక అణచివేతకు పాల్పడుతున్నవారికి ఆర్థికపోషణ ఈ పెద్దలకు అవసరం. అందువల్ల వ్యవస్థీకృతంగా కొనసాగుతున్న పరాభవాల పరంపరను వారు

అడ్డుకోలేరు. గతంలో ఇలాంటి అసాంఘీక కార్యకలాపాలను బ్రాహ్మలు కొనసాగించేవారు. అయితే వారి అఘాయిత్యాలు చాలా వరకు దూషణలు తిట్లకే పరిమితం అయిఉండేవి. కాని, ఇప్పుడు అగ్రవర్ణ హిందువులు ఈ అసాంఘీక చేష్టలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. వాళ్ళు ఆయుధాలను, కత్తులు తుపాకులను ఉపయోగిస్తున్నారు.

ఇదంతా వాళ్ళు ఎందుకు చేస్తున్నట్లు? వాళ్ళ మనసులో ఏముంది? షెడ్యూల్డ్‌కులాల ప్రజల నుంచి వారు ఏం కోరుతున్నారు? షెడ్యూల్డ్ కులాలు కొన్ని మామూలు సదుపాయాల కోసం తమముందు చేతులు చాచి నిలబడాలని వారి ఉద్దేశ్యం. నాగరిక దుస్తుల్లోని బానిసల్లా ఉండాలని వారి అభిప్రాయం. షెడ్యూల్డ్‌కులాల ప్రజలు తమకు అణగిమణగి ఉండాలన్నది వారి అంతరంగం. వారు అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా నోరెత్తరాదు, సమాన హక్కులు కోరరాదు.

ఈ అగ్రవర్ణ హిందువులు ఒకప్పుడు బ్రాహ్మణుల చేతిలో బ్రాహ్మణుల ఆధిపత్యం ఉన్న కాలంలో అవమానాలకు గురయిన వారే. కాని తరువాత వారికి ఆధిపత్యం లభించింది. అయితే షెడ్యూల్డ్ కులాల పరిస్థితి మారలేదు. అవమానాలు, హత్యలు అధికమయ్యాయి. గతంలో పరిస్థితి క్రూరంగా ఉండేది, ఇప్పుడు మరింత దిగజారింది. పరిస్థితి మెరుగుపడే సూచనలేవీ కనబడడం లేదు. హిందూమత ధ్వజవాహకులు హిందూమతం అత్యుత్తమమైనదిగా, విశాలదృక్పథం కలదనీ వాదిస్తారు. కాని పైన పేర్కొన్న క్రూరత్వాన్ని, అణచివేతలను నిరోధించాలని భావించరు. ఒక వైపు వారు క్రైస్తవ, ముస్లిం, బౌద్ధ తదితర హైందవేతరులకు సమానహక్కులు ఉన్నాయని అంటారు. సమాన గౌరవాదరాలు, ప్రతిష్ఠ ఉండాలని అంటారు. కాగా మరోవైపు తమ సొంత మతంలోని ప్రజలను క్రూరంగా అణచివేస్తుంటారు.

ఇలాంటి పరిస్థితుల్లో, హిందూమతం పట్ల ఉత్త భ్రమల్లాంటి ఆశలు పెట్టుకొని షెడ్యూల్డ్ కులాలు ఎంతకాలం అణగి మణగి ఉంటాయి? వేదాల ద్వారా హిందూమతం కేవలం పరాభవాల పరంపరను బోధిస్తుంది. నిత్య జీవితంలో హిందూమతం వారికి అవమానాలనే ప్రసాదిస్తోంది. చివరకు ఈ



చెడులన్నీ నేడుగాని, రేపుగాని తొలగిపోతాయన్న హామీ ఇవ్వగల హిందువు ఎవరూ ముందుకు రావడం లేదు.

మీనాక్షిపురంలో, మరికొన్ని ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాలు ఇతర మతాలను స్వీకరించాయి. షెడ్యూల్డ్ కులాలు తాము ఎన్నుకొన్న మతాన్ని స్వీకరించి జీవితం గడపకుండా హిందువులు వారిని అడ్డుకోలేక పోయారు. ఏం చేయగలరు వారు? మీనాక్షిపురం వెళ్ళి మళ్ళీ పాతమతంలోకి రండని విజ్ఞప్తి చేయడం తప్ప వారేమీ చేయలేక పోయారు. షెడ్యూల్డ్ కులాలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించే పథకాలేవి వారి దృష్టిలో లేవు. లేదా, సంస్కరణలను ప్రవేశపెట్టి షెడ్యూల్డ్ కులాలకు నమ్మకం కలిగేలా నచ్చజెప్పే ఉద్దేశ్యాలు కూడా ఏవీ వారికి లేవు.

మతాన్ని వదలి వేరే మతం పుచ్చుకోవద్దని అంటారు. అంతే తప్ప, అత్యాచారాలను, అన్యాయాలను నిరోధించే సంస్కరణలేవీ ఆలోచించరు. పురుషసూక్తంలోని అవమానకర వ్యాఖ్యను తొలగించడానికి హిందువులు సిద్ధపడతారా? షెడ్యూల్డ్ కులాలను అవమానపరిచే పంక్తులను భగవద్గీత నుంచి తొలగించడానికి ఒప్పుకుంటారా?

ఒక దళితుడిని మత నాయకునిగా అంగీకరిస్తారా? శైవ, వైష్ణవ ఆలయాల్లో ఎవరయినా దళితుడిని పూజారిగా నియమిస్తారా? షెడ్యూల్డ్ కులాలను అవమానపరుస్తున్న అగ్రవర్ణ హిందువులను వ్యతిరేకించి ప్రతిఘటిస్తారా? అఘాయిత్యాలకు పాల్పడినవారిని మతం నుంచి బహిష్కరణ వ్రేటు వేయగలరా?

ఇవేవి వారు చేయరు. కాని మతం మార్చుకోరాదని హితబోధ మాత్రం చేస్తారు. నేడు కూడా హిందూసంస్థకు చెందిన ఒక నాయకుడు రామగోపాలన్ (మున్నాని) "మాలో మాకు వెయ్యి విభేదాలు ఉన్నప్పటికీ, వాటిని మేము పరిష్కరించుకుంటాము. అంతేకాని ఇతర మతాలను, ముఖ్యంగా ఇస్లాంను స్వీకరించం" అంటూ హూంకరిస్తున్నారు. సరే, సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్యల పరిష్కారం విషయమై వీళ్ళు షెడ్యూల్డ్ కులాలతో కనీసం చర్చలు ఎప్పుడయినా

జరిపారా? ఈ సమస్యలు కేవలం చర్చల వల్ల పరిష్కారం కావు. కాబట్టి, ఈ మతంలోనే ఉండి, అన్యాయాలను తొలగించడం అన్నది ఎవ్వరూ చేయలేని పని అన్నది ఓ వాస్తవం. హిందూమత నాయకుడెవ్వరూ సాంఘిక అన్యాయాలు నిర్మూలించే విషయంలో సహాయం చేయరు. కాబట్టి మతాన్ని వదిలితేనే పరిష్కారం సాధ్యమవుతుంది.

## ద్రావిడ ఉద్యమాలు ఈ అన్యాయాలను తొలగించగలవా?

దక్షిణాదిన ఉన్న రాజకీయ పార్టీలలో ద్రావిడ ఉద్యమం ఒకప్పుడు షెడ్యూల్డ్ కులాలకు సన్నిహితంగా ఉండేది. నేడు చాలా తక్కువ మందిలో ఈ స్పృహ ఉంది. శాసనసభల్లో, పార్లమెంటులో స్థానాల కోసం పోటీపడడం ప్రారంభమైన తర్వాత వీరిలోనూ అగ్రవర్ణాల అభిజాత్యం మొలకెత్తింది.

ఒకప్పుడు ద్రావిడ యువకులు కేవలం షెడ్యూల్డ్ కులాల నుంచి మాత్రమే భోజనం తీసుకునేవారు. కొందరు కులాంతర వివాహాలు కూడా చేసుకున్నారు. అణగారిన ప్రజలను వారు నీచంగా చూసేవారు కాదు. మీ కులం ఏమిటి? అని ఎవరినైనా అడగడమే అమర్యాద అని భావించేవారు.

కాని చట్టసభల్లో ప్రవేశించాక ఈ భావాలు, నడవడికలు అన్నీ మారిపోయాయి. అగ్రవర్ణాల భావాలు ఉన్నవారు కీలక స్థానాలు పొంద గలిగారు. పార్టీల్లో కీలక స్థానాల్లో ఉన్నవారిలోనూ ఈ అగ్రవర్ణ భావాలు అంకురించాయి. పార్టీ శ్రేణుల్లోనూ అగ్రవర్ణ అభిజాత్య భావాలు చోటు చేసుకున్నాయి. బహిరంగంగా తాము 'దేవర'లమని తాము 'వన్నియార్', 'గౌండార్'ల మని ప్రకటించడం ప్రారంభమయ్యింది. తమ కుల ప్రత్యేకతను ఉపయోగించి ప్రత్యర్థులలో కలిశారు. షెడ్యూల్డ్ కులాలను సాంఘీకంగా మరింత మరింత దిగజార్చారు.

ద్రవిడ పార్టీలు అధికారంలోకి వస్తే కులరహిత సమాజం ఏర్పడు తుందని, అంతరాలు తొలగిపోతాయని, షెడ్యూల్డ్ కులాలపై అఘాయిత్యాలు అణచివేతలు ఉండవని ఆశించారు చాలామంది.



కాని, కీలవెన్మని, విల్లుపురం, పులియన్ గుడి ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాల ఊచకోత, ద్రవిడ పార్టీల పాలనా కాలంలోనే జరిగింది.

డి.యం.కె. నాయకుడు కరుణానిధి తన కుమారునికి ఒక షెడ్యూల్డ్ కులాల కన్యతో వివాహం జరిపారు. ఆయన షెడ్యూల్డ్ కులాలపై జరిగిన అఘాయిత్యాల పట్ల ఆవేదన వెలిబుచ్చుతూ, పార్టీలోనూ కులతత్వం తలెత్తిందని అన్నారు. ఎ.డి.ఎం.కె. ది కూడా ఇదే పరిస్థితి.

ఈ విషయంలో డి.ఎం.కె. కొద్దిగా మెరుగైన పార్టీ అని చెప్పవచ్చు. అయితే ఈ పార్టీ కూడా సాంఘిక అసమానతలు తొలగించడానికి ఏమాత్రం ప్రయత్నించడం లేదు.

దేవుడు లేదని నినాదాలు ఇవ్వడం వల్ల లేదా నల్లచొక్కాలు ధరించి ప్రదర్శన చేయడం వల్ల సాంఘిక రుగ్మతలు తొలగిపోవు. నుదుటి మీది చిహ్నాలు చూస్తే డి.కె. కార్యకర్తలకు, మత నాయకులకు తేడా ఉండదు. అయితే డి.కె. కార్యకర్తలు కూడా అవమానాలు ఎదుర్కొన్నారు.

✦ మేము నాస్తికులుగా మారిపోతాం.

✦ ఆ విధంగా, ఎస్.సి.లపై అత్యాచారాలను డి.కె. తొలగించగలదా. కనీసం వచ్చే తరంలోనయినా ఈ పని చేయగలదా?

లేదు –

అలాంటి సూచనలు కూడా కానరావడం లేదు–

ద్రవిడ ఉద్యమంలో కూడా అగ్రవర్ణ హిందూ భావాలు చాపక్రింద నీరులా వ్యాపించాయి. ఇపుడు సాంఘిక అసమానతలు తొలగించడం పట్ల వారికి ఆసక్తి లేకుండా పోయింది.

షెడ్యూల్డ్ కులాల్లో ఆర్థికంగా బాగున్న కులాల నాయకులు సమాజంలో అత్యంత వెనుకబడిన చాకలి, మంగలి లాంటి కులాల అభివృద్ధికి కొత్త పథకాలు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

అంటే డి.ఎం.కె. పార్టీ సామాజిక విప్లవంపై పూర్తిగా ఆశలు వదులుకున్నది. ఆ పార్టీలోని ధనికులయిన అగ్రవర్ణ హిందువుల ధనబలం, ఓటు బలాలపై ఆధారపడి పార్టీని నడపడమే మంచిదని భావిస్తున్నారు. మరో దురదృష్టం ఏమంటే కొందరు డి.ఎం.కె. నేతలు తమ ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాలపై దాడులను ప్రోత్సహించారు కూడా.

తిరుఇలయ పెరుమాల్ గారూ !

'వార్త' అంటే ఏమిటన్న విషయాన్ని నేను మీ నుంచి తెలుసుకొన్నాను.

చిదంబరంకు దగ్గర ఉన్న కాటుమన్నార్ గుడి గ్రామంలోని షెడ్యూల్డ్ కులాల ప్రజలు తాము ఇక నుంచి మృతదేహాలను మేయడం, చావు డప్పులు వాయించడం వంటి పనులు సైతం చేసేది లేదని నిర్ణయించి బాయ్‌కాట్ చేసినపుడు ఒక అగ్రవర్ణ హిందూనాయకుడు ఈ పనులు చేయించడానికి బయటి నుంచి కొందరు మనుషులను పిలిపించాడు. దాంతో తీవ్రమైన ఘర్షణలు తలెత్తాయి. అవి కాల్పులకు దారితీశాయి. ఆ అగ్రవర్ణ నాయకుడు ద్రవిడ ఉద్యమానికి చెందిన ఎం.ఎల్.ఏ.

ఇది భవిష్యత్తుకు ఒక సూచన. షెడ్యూల్డ్ కులాలకు భవిష్యత్తులో ఏం ఎదురు కానుందో చెప్పే సూచన. ద్రవిడ ఉద్యమంలోని క్రింది స్థాయి నాయకులు కూడా దళిత ప్రజలను పీడిస్తారని చెప్పే సూచన ఇది.

కాబట్టి దళిత ప్రజల కష్టనష్టాలను, సమస్యలను ద్రవిడ ఉద్యమం తొలగించలేదు. వాళ్ళు దళిత ప్రజల కోసం పోరాడే హీరోలు కారు. వాళ్ళు ఇలాంటి పనులు చేయరు.

## జాతీయ పార్టీని నమ్మగలమా?

దళిత జనోద్ధరణ కోసం జాతీయ పార్టీపై ఈ విషయమయి ఎందుకు ఆధారపడకూడదు, జాతీయపార్టీ ఈ పనులు ఎందుకు చేయదు? అని వాదించేవారు కూడా ఉన్నారు.



తిరుఇలయ పెరుమాల్ గారూ !

మీరే దీనికి ఉదాహరణ. మీరు జాతీయ పార్టీకి రాష్ట్రనేతగా ఉన్నారు. ఒక పార్లమెంటు సభ్యునిగా మీరు భారతదేశంలో దళిత ప్రజల పరిస్థితి గురించి మీ ఒక అధ్యయనాన్ని నివేదించారు. ఆ నివేదిక మీ పేర ఉంది. ఇపుడు మీరు జాతీయ పార్టీ నుంచి బయటకు వచ్చారు. మానవ హక్కుల ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయపార్టీ దళితప్రజల సమస్యలను పరిష్కరించలేదనడానికి మీ ఉదంతమే ఒక ఉదాహరణ.

జాతీయ పార్టీలలో కాంగ్రెసు కొద్దో గొప్పో రాజీధోరణి ప్రదర్శించేపార్టీ (సాంఘిక అసమానతలు తొలగించే విషయంలో ఈ పార్టీకి కూడా ఆసక్తి లేదు) అయితే, కాంగ్రెసుతో సహా జాతీయ పార్టీలన్నీ అగ్రవర్ణ హిందూ పార్టీలే అన్న విషయం మీకూ తెలుసు.

మీరు కాంగ్రెసును వదలి బయటకు వచ్చారు. సాంఘిక రుగ్మతలను తొలగించడానికి జాతీయ పార్టీలు పూనుకొంటాయంటే మీరు నమ్మరు.

డి.కె., డి.ఎం.కె., ఎ.ఐ.ఎ.డి.ఎం.కె.లు ఇంకా కాంగ్రెసు తదితర జాతీయ పార్టీలు అన్నీ "హిందూ సామాజిక సంస్కర్తలు" అన్న జాబితాలో చేర్చదగిన పార్టీలు.

అయితే, ఈ సంస్కర్తలు చెప్పేది ఒకటి, చేసేది మరొకటి. ఆచరణలో వీళ్ళు ఎక్కడా కనబడరు.

డా. అంబేద్కర్ చెప్పినట్లు ఈ సంస్కర్తలను వదిలించుకోవడమే మంచిది.

మనం సమకాలీన ప్రపంచ పరిణామాలను పోల్చి చూస్తే అమెరికాలో నల్లవారు అణచివేతకు గురవుతున్నారు. అయితే కొందరు తెల్లవారు నల్లవారిని కాపాడడానికి ముందుకు వస్తున్నారు, నల్లవారి కోసం రక్తం చిందించిన తెల్లవాళ్ళు ఉన్నారు. అలాంటి వారితో మనం మన దేశంలోని ఈ సోకాల్డ్ సంస్కర్తలను పోల్చగలమా? వీరి హృదయాల్లో దళితుల పట్ల సానుభూతి ఉందని నమ్మగలమా?

'హరిజనుల'న్న పేరుతో జాతీయవాదం వారిని మోసగిస్తోంది.

ద్రవిడులు 'ఆది ద్రవిడులన్న' పేరుతో ఉనికిలో ఉన్నారు. ఇందులో మళ్ళీ కొన్ని మినహాయింపులు ఉన్నాయి. అంటే జాతీయ పార్టీలుగాని, ద్రవిడ పార్టీలు గాని దళితుల పట్ల కొనసాగుతున్న అన్యాయాలను తొలగించవు. ఈ విషయమై వారిలో చిత్తశుద్ధి కూడా లేదు.

## కమ్యూనిస్టులు ఈ అణచివేతలను తొలగించగలరా?

కమ్యూనిస్టులు సైద్ధాంతికంగా, మౌలికంగా ఎలాంటి సాంఘిక తారతమ్యాలను ఒప్పుకోరు. ఆ పార్టీ ఎవరినీ హీనంగా చూడదనీ, ఏ వ్యక్తినీ లేదా ఏ వర్గాన్నీ సాంఘిక హోదా ప్రాతిపదికన న్యూనపరచదన్నది కూడా వాస్తవమే. ఈ వాస్తవాన్ని అంగీకరించడమే నిజాయితీ.

కాని కమ్యూనిస్టులు తమ పార్టీ పరిధుల్లో గిరిగీసుకొని ఉండిపోయారు. తమ పార్టీకి ఆవల ఒక శ్రామికునిపై, ఒక కూలివానిపై జరిగే అఘాయిత్యాల పట్ల పార్టీ శ్రద్ధ చూపదు. పార్టీకి చెందని వ్యక్తుల కోసం పార్టీ ఏ చర్యా చేపట్టదు. వారికి కొన్ని నిర్ధారిత కార్యకలాపాలు ఉన్నాయి :

★ బోనస్ కోసం డిమాండు.

★ బోనసుల కోసం ప్రయికులు.

★ ధర్నాలు, మోర్చాలు, ఘెరావ్‌లు.

★ పార్టీలో సభ్యులను చేర్చడం.

★ ఆందోళనలు చేపట్టడం.

★ పెద్ద పెద్ద సమావేశాలు... వగైరా.

పై కార్యకలాపాల్లో వారు తలమునకలయి ఉంటారు. సాంఘిక అణచివేతల గురించిగాని, వాటిని ప్రతిఘటించవలసిన అవసరం గురించిగాని వారికి ధ్యాస ఉండదు. ఈ విషయమై మనం వారిని తప్పుబట్టలేము కూడా.



ఎందుకంటే కారల్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో వగైరాలు చూసిన సమాజాన్ని మాత్రమే వీళ్ళు చూస్తారు. భారత సమాజం ఆ సమాజానికి పూర్తిగా భిన్నమైనది. అక్కడి సమాజాల్లో చతుర్వర్ణ వ్యవస్థ లేదు. కాబట్టి కుల అంతరాలు తొలగించవలసిన అగత్యం ఆ మహానుభావులకు కలగలేదు.

ఒక శతాబ్దం క్రితం (మర్క్సిజం వ్యవస్థాపకుడు కారల్ మార్క్స్ భారత దేశం గురించి కొన్ని విషయాలు రాశాడు. లండన్ మ్యూజియం లైబ్రరీలో కూర్చుని ఈ విషయాలు రాశాడు. చతుర్వర్ణ విభజన అన్నది కేవలం వృత్తుల ప్రాతిపదికన మాత్రమే జరిగిందని అనుకొన్నాడతను. ఈ వ్యవస్థలోని లోపాలు, దాని ప్రతికూల అంశాలను గురించి ఊహించ లేకపోయాడు. ఆయన గనుక వ్యక్తిగతంగా భారతదేశం పర్యటించి, ఇక్కడి వ్యవస్థను కళ్ళారా చూసివుంటే ఈ వ్యవస్థ ఎలాంటిదో అర్థం చేసుకొని ఉండేవాడు. అపుడు తగిన విధంగా తన భావాలు ప్రకటించి ఉండేవాడు. ఆయన ఈ వ్యవస్థను వృత్తుల ఆధారంగా ఏర్పడిన వ్యవస్థ అని భావించాడు.

కాబట్టి, భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆరంభ దశల నుంచి పార్టీ సెక్రటరీలుగా ఉంటున్న అగ్రవర్ణ పెద్దలు కులవిచక్షణ గురించి పట్టించు కోనవసరం లేదని భావించారు. కార్మిక వర్గం ఒక్కటయితే వర్గ పోరాటాన్ని కొనసాగించి పాలనాధికారాన్ని పొందగలరని, అప్పుడు సాంఘిక అణచి వేతలు, పరాభవాలు మటుమాయమవుతాయని తీర్మానిస్తారు.

దళిత ప్రజలు ఈ మాటలు విశ్వసించారు. అందువల్ల వారు పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. తమ తరపు నుంచి సాధ్యమైనంతవరకు శక్తిసామర్థ్యాలు ఇచ్చారు. ఇస్తూనే ఉన్నారు. కాని వారికి ఎలాంటి ప్రతిఫలమూ లభించలేదు. లభించే సూచన కూడా లేదు.

కమ్యూనిస్టులు ప్రచారం చేస్తున్నది ఆచరణలో అసాధ్యం. కమ్యూనిస్టులు కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో అధికారం పొందగలిగారు. మరి ఆయా రాష్ట్రాల్లో సాంఘిక అణచివేతలను వాళ్ళు తొలగింగలిగారా? లేదు. ఎందుకని?

పాలక పక్షం వద్ద ఈ ప్రశ్నకు రెడీమేడ్ సమాధానం ఉంటుంది. "మేము అధికారంలో ఉన్నప్పటికీ పాలనా యంత్రాంగంలో పాత భావాలు కలిసిన వాళ్ళే అధికారులుగా ఉన్నారు. వారిలో కులభావాలు అలాగే ఉన్నాయి" అన్నదే ఆ సమాధానం. సమాజంలో కూడా పాతభావాలే ఉన్నాయని అంటారు. అలాగయితే, ఈ పరిస్థితి మార్చడానికి వీళ్ళు తీసుకున్న చర్యలేమిటి? ఈ ప్రశ్నకు జవాబు లేదు. అంటే, భవిష్యత్తులో కూడా కమ్యూనిస్టులు సాంఘిక అణచివేతలకు వ్యతిరేకంగా సామాజిక స్పృహను ప్రదర్శించరు, సామాజిక రుగ్మతలు తొలగించడానికి ఏమాత్రం ప్రయత్నించరు. ఎందుకంటే వారి వద్ద అలాంటి పథకం ఏదీ లేదు. అలాంటి ఆలోచన కూడా లేదు.

కాబట్టి కమ్యూనిస్టు పార్టీల వల్ల అణగారిన దళిత ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు.

## క్రైస్తవం లేదా బౌద్ధమతాలు స్వీకరించడం

క్రైస్తవం లేదా బౌద్ధమతంలో చేరడం వల్ల సాంఘిక అణచివేతల నుంచి విముక్తి లభిస్తుందా?

క్రైస్తవమతం కులవ్యవస్థను ఒప్పుకోదు. సాంఘిక అణచివేతలను అంగీకరించదు. కాని భారతదేశంలో క్రైస్తవాన్ని ప్రచారం చేస్తున్నవారు, తమ మతంలోకి హైందవ ఆచారాలు చోటు చేసుకోడాన్ని అనుమతించారు. ఫలితంగా ఇక్కడ క్రైస్తవ మతంలో బహుళ కులాలు ఏర్పడ్డాయి.

కొందరు చెట్టియార్లు, పిళ్ళాయిలు, నాదరులు, క్రైస్తవ పేర్లను పెట్టుకొంటున్నారు. కాగా కొందరు హిందువులు శిలువ ధరిస్తున్నారు. దురదృష్టం ఏమిటంటే దళిత వర్గాలు క్రైస్తవాన్ని స్వీకరించిన తర్వాత కూడా అణగారిన వర్గాలుగానే మిగిలిపోయాయి. తిరుచ్చిలో, చివరకు స్మశాన వాటికల్లోనూ విభజన స్పష్టంగా కనబడుతోంది. ఒక వైపున క్రైస్తవ పిళ్ళయిలకు స్థలం కేటాయిస్తే మరో వైపున క్రైస్తవ ఆది ద్రావిడారులకు స్థలం కేటాయించబడింది. ఆ విధంగా, క్రైస్తవంలోనూ సాంఘిక అణచివేత చోటు చేసుకొంది. అయితే



ఇది విభిన్న రూపాలలో ఉంది. ఇలా క్రైస్తవ మతం కూడా సాంఘిక రుగ్మతలను తొలగించలేకపోయింది.

## బౌద్ధమతం

సాంఘిక రుగ్మతలను తొలగించాలన్న ఉద్దేశ్యంతో డా. అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించారు. ఆయన తన తోటి దళిత ప్రజలతో కలసి సామూహికంగా బౌద్ధాన్ని స్వీకరించారు. కాని దురదృష్టవశాత్తు, ఆ తర్వాత కొంతకాలానికే ఆయన మరణించారు. సాంఘిక అణచివేతలు తొలగించే విషయమయి ఆయన మనసులో చాలా పథకాలు ఉండేవి. కాని వాటిని అమలుపరిచే వ్యవధి ఆయనకు లభించలేదు.

ఆయన బౌద్ధమతాన్ని విస్తృతస్థాయిలో అభివృద్ధి పరచాలనుకున్నారు. దళితుల్ని బౌద్ధమతంలో చేర్చడం ద్వారా దీన్ని సాధించాలనుకున్నారు. అలా చేస్తే భారతదేశానికి పొరుగున ఉన్న బర్మా, భూటాన్, శ్రీలంక, జపాన్ వంటి దేశాలు తమకు చేయూతనిస్తాయని భావించారు. కాని ఏం జరిగింది?

భారతదేశంలో బౌద్ధమతం పెద్దమతం కాదు. అందువల్ల బౌద్ధమతంలో చేరిన దళితప్రజలు ఒంటరివారిగానే ఉండిపోయారు. వారు నూతన బౌద్ధులుగా పిలువబడ్డారు. వారికి కొన్ని సౌలభ్యాలు మాత్రం లభించాయి కాని వారి సామాజిక స్థాయి మాత్రం మారలేదు. వారు బౌద్ధమతంలో చేరినా ఎలాంటి ప్రయోజనమూ సిద్ధించలేదు. ఇక ఇప్పుడు ఏ ప్రత్యామ్నాయం మిగిలింది ఈ దళిత జనానికి?

## ఇస్లాం ఈ సమస్యకు పరిష్కారాన్నిస్తుందా?

శతాబ్దాలుగా అణచివేతకు గురైన దళితుల డిమాండ్లేమిటన్నది చూద్దాం:

* అందరితో సమానంగా చూడడం.
* అందరి మాదిరిగానే అవే కప్పుల్లో పానీయాలు తాగడం.
* అందరి మాదిరిగా అవే పళ్ళాల్లో భోజనం చేయడం.

## ఈ కోరికలను ఇస్లాం నెరవేరుస్తుందా?

"ఇస్లాం అంటే యూరోపియన్లు భయపడడానికి కారణముంది. క్రైస్తవాన్ని స్వీకరించిన కొత్త వ్యక్తి క్రైస్తవుల మాదిరిగా పూర్తి హోదా పొందలేడు. ఇస్లాంను స్వీకరించినవాడు, ఆ మరుక్షణం నుంచి ముస్లిములందరితో సమాన హోదా పొందుతాడు. వారి కప్పులో తాగుతాడు. వారి పళ్ళెంలో భోజనం చేస్తాడు. నేను ఈ వాస్తవాన్ని ప్రత్యక్షంగా చూశాను."

## స్వామి వివేకానంద ఇలా రాశారు :

"ఇస్లాంలో కుల విచక్షణ లేదు. వర్ణ వివక్ష అంతకన్నా లేదు. చివరకు స్త్రీ పురుష తారతమ్యం కూడా లేదు."

ఉదాహరణకు టర్కీ సుల్తాన్ ఒక ఆఫ్రికా నీగ్రోను బానిసగా చేశాడను కోండి. అతనికి సంకెళ్ళు వేసి టర్కీ తీసుకొచ్చాడనుకోండి. ఆ బానిస ఒకవేళ ఇస్లాం స్వీకరిస్తే అతడిలో తగిన అర్హతలు ఉంటే అతడు రాకుమారిని కూడా పెళ్ళాడవచ్చు.

పార్సీ ఆచార్యుడు తహూర్ లాల్ ఇలా రాశారు :

"ఇస్లాంను ఎవరు స్వీకరించినా, వాళ్ళు నీగ్రోలు అయినప్పటికీ వారికి హృదయపూర్వకంగా ఆహ్వానం లభిస్తుంది."

"కొత్తగా ఇస్లాంలో చేరిన వారికి ముస్లిములందరితో సమాన హోదా, సమాన స్థాయి లభిస్తాయి."

"ఇస్లాంలో కులం, జాతి, వర్ణం, దేశం వగైరా విచక్షణలు ఉండవు. పూర్తి స్థాయి సమానత్వం, సౌభ్రాత్రతలు లభిస్తాయి. ఇది వారి తరపున లభిస్తున్న ప్రత్యేక ఆదరం."

ఇస్లాంలోని మౌలిక సిద్ధాంతం ఇదే. ముస్లిముల నరనరాల్లో ఈ సమానత్వం జీర్ణించుకొని ఉంది. దైవప్రవక్త బోధనలను పాటించడం వల్లనే ఇది అభివృద్ధి చెందింది.



ఈ గుణగణాలు ఈనాడు కొత్తవేమీ కాదు. దైవప్రవక్త ముహమ్మద్ (స) కాలం నుంచి వారసత్వంగా అందుతూ వస్తున్నాయి.

దాదాపు 1400 సంవత్సరాల క్రితం, అరేబియాలో ఆఫ్రికా నీగ్రోలు బానిసలుగా ఉండేవారు. అయితే వారు ఇస్లాం స్వీకరించిన వెంటనే ఇతరులతో పాటు సమాన హోదా పొందేవారు.

అలాంటి వారిలో బిలాల్ ఒకరు. ఆయన నీగ్రో బానిస. ఆయన బానిసగా ఉన్నప్పుడే ఇస్లాం స్వీకరించారు. ఈ విషయం తెలిసి అతని యజమాని ఆగ్రహించాడు. ఆయన్ను ఎడారిలోని కణకణ మండే ఇసుకపై పడుకోబెట్టి రొమ్ముపై బండరాయి ఉంచాడు. ఈ చిత్రహింస తర్వాత బిలాల్ ఇస్లాం విడిచి పెడతారని భావించాడతను. కాని, బిలాల్ ఏమాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. పైగా దేవుడు ఒక్కడే, దేవుడు ఒక్కడే అని నినదించారు. అబూబకర్ (ప్రవక్త అనుచరులు) కొంత సొమ్ము బిలాల్ యజమానికి చెల్లించి ఆయన్ను విడిపించుకున్నారు.

ఇస్లాం బిలాల్ పట్ల ఎలా వ్యవహరించింది? ముస్లిములను నమాజుకు పిలిచే 'అజాన్' ఆచారాన్ని ప్రారంభించే గౌరవం ఆయనకు లభించింది. ఆయన్ను గౌరవపూర్వకంగా హజ్రత్ అని పిలువడం జరిగింది. మరికొందరు ఆయన్ను సయ్యదిన (నాయకుడు) అని గౌరవించారు. దైవప్రవక్త (స) సన్నిహిత సహచరునిగా (సహాబి) ఆయనకు గౌరవం లభించింది.

ఒకసారి బిలాల్ (రజి) చేతి నుంచి ఒక పాత్ర జారి పడి పగిలిపోయింది. దైవప్రవక్త (స) శ్రీమతి ఒకరు ఈ విషయమై ప్రవక్త (స)కు ఫిర్యాదు చేశారు. బిలాల్‌ను పని నుంచి, ఇంటి నుంచి తొలగించమన్నారు ఆమె. దానికి దైవప్రవక్త (స) జవాబిస్తూ "ఇంటి నుంచి తొలగించే మాటయితే బిలాల్‌ను కాదు మిమ్మల్ని పంపించవలసి ఉంటుంది" అని జవాబిచ్చారు.

ఓసారి ఈజిప్టుకు ఒక ఇస్లామీయ బృందం చర్చలకు వెళ్ళింది. ఆ బృందానికి నాయకుడు పొడుగరి అయిన ఒక నీగ్రో. ఈజిప్షియన్లు ఒక నీగ్రోతో చర్చించడానికి తటపటాయించారు.

ముస్లిం బృందం వెంటనే ప్రతిస్పందిస్తూ, “మాలో అలాంటి విభేదాలు లేవు. పైగా ఆయన మాకు నాయకుడు. మా చర్చలు ఆయన నేతృత్వంలో మాత్రమే జరుగుతాయి” అని తెగేసి చెప్పారు. ఈ మాటలు విని ఈజిప్షియన్లు నిర్ఘాంతపోయారు. అయితే చర్చలు జరగకపోతే యుద్ధం తప్పనిసరి అవుతుంది అందువల్ల ఆ నల్లవాని నేతృత్వంలో చర్చలు జరుగడాన్ని ఒప్పుకున్నారు.

ముస్లిములకు మాత్రమే సమానత్వం ఎలా సాధ్యమయ్యిందన్నది ఓసారి పరిశీలిద్దాం:

❊ కొన్ని మతాలు జాతి, వర్ణాలను పుట్టుకతో ముడిపెడతాయి.

❊ కొన్ని మతాలలో తారతమ్యాలకు పుట్టుకకు సంబంధం లేకపోయినప్పటికీ, నిత్య జీవితంలో ఈ విభేదాలు కనబడతాయి.

❊ కాగా ఇస్లాంలో ప్రపంచ ప్రజలంతా ఆదం సంతానమని దివ్య ఖుర్ఆన్ ప్రకటించింది.

❊ ముస్లిములందరూ పరస్పరం సోదరులని ఖుర్ఆన్ ప్రకటించింది.

❊ మహాప్రవక్త ముహమ్మద్ (స) కాలంలోనూ, తదుపరి కాలాల్లోనూ ఈ సమానత్వం పూర్తిస్థాయిలో ఆచరణలో ఉంది.

❊ అంతేకాదు, స్త్రీ పురుషుల మధ్య కూడా ఎలాంటి తేడా లేదు. ఈ విషయాన్ని ఇతర మతాలు ఏవీ నొక్కి చెప్పలేదు.

ముహమ్మద్ (స) కాలం నాటి అరబ్బులు జాతి, వర్ణం రీత్యా తమది అత్యున్నత జాతి అని గర్వించేవారు. మక్కా ప్రజలు ఇస్లాం స్వీకరించిన తర్వాత దైవప్రవక్త (స) స్పష్టంగా ప్రకటనచేస్తూ ఇలా అన్నారు:

“వారి శరీర వర్ణం తెల్లగా ఉన్నంత మాత్రాన వారికి నల్లవారిపై ఎలాంటి ఆధిక్యత లేదు. అరబ్బులకు అరబ్బేతరులపై ఎలాంటి ఆధిక్యత లేదు. ధార్మిక విశ్వాసం కలిగివున్న వారిదే ఆధిక్యత. ఆ విధంగా ఇస్లాంలోని మౌలిక సూత్రాన్ని దైవప్రవక్త (స) బోధించారు. నేటికీ ఈ ఆదర్శాన్ని మనం చూస్తున్నాం.



అందువల్లనే సాధారణంగా అణగారిన ప్రజలు ఇస్లాంలో చేరాలని కోరుకుంటారు. అమెరికా నీగ్రోలు, ఆఫ్రికన్లు ఇంకా ప్రపంచంలోని పీడిత జనావళి చేస్తున్నది ఇదే.

ఇస్లాంలో అలాంటి ఆకర్షణ ఉంది. ముఖ్యంగా సమానత్వం అన్న ఆకర్షణ ఉంది. అందువల్లనే పీడిత జనం ఇస్లాం వైపుకు ఆకర్షించబడుతున్నారు. వాళ్ళు ఇస్లాంలో చేరకుండా ఏశక్తీ ఆపలేదు.

సాధారణ సంఘటనల మాదిరిగా, అన్ని సంఘటనలు సహజంగానే సంభవిస్తాయి. ఎన్ని అడ్డంకులు ఉన్నా పరిణామాలు ఆగవు. సూర్యోదయం సూర్యాస్తమయాలు నిరంతరం కొనసాగుతున్నంత సహజంగా పీడిత ప్రజలు ఇస్లాం వైపునకు, సత్పథం వైపునకు నడవక తప్పదు. ఈనాడు అదే జరుగుతోంది కూడాను. కొన్ని స్వార్థశక్తుల ప్రయత్నాల వల్ల ఈ పరిణామం ఆలస్యం కావచ్చు కాని, ఆగిపోవడం మాత్రం జరగదు.

## ఇస్లాం ఏవిధంగా సాంఘిక అణచివేతను తొలగిస్తుంది?

ఒక వ్యక్తి ఇస్లాం స్వీకరించిన వెంటనే అతని గతం గురించిన ప్రస్తావన ఉండదు. అతని పేరు మారిపోతుంది. కుల చిహ్నాలు తొలగిపోతాయి. పాత ఆచారాలు సంప్రదాయాలు ఉండవు. మందిరం లేదా చర్చి మారిపోతుంది. ప్రార్థనాపద్ధతులు మారిపోతాయి. ఇతరులను గౌరవించడం, సంబోధించడంలో సమానత్వం ప్రబలంగా ఉంటుంది. అతని కుటుంబ జీవనంలో అభిలషణీయమైన పెనుమార్పులు వస్తాయి. అవమానకరమైన సమస్త విధాల కట్టుబాట్లు తొలగిపోతాయి. ప్రపంచ మానవులందరితో మంచి సంబంధం ఏర్పడుతుంది. నిర్లక్ష్య ధోరణి తొలగిపోతుంది. క్రమశిక్షణ అలవడుతుంది. ఏ ఒక్కరికి అవమానం జరిగినా ముస్లిములందరూ అతనికి మద్దతు ఇస్తారు.

## ఇలయ పెరుమాల్ గారు !

నంధనార్ – ఒక అంటరానివాడు, ఒక హిందూ దేవాలయంలో ప్రవేశం కోసం పడిన పాట్లు మన చరిత్రలో ఉన్నాయి. అతను దళిత కుటుంబానికి

చెందినవాడు అయినందువల్లనే అర్హతలేని వాడయిపోయాడు. అతడు తన సంకల్పాన్ని చాటి చెప్పడానికి అగ్ని స్నానం చేయవలసి వచ్చింది.

ఆ తర్వాత కూడా ఆలయ ప్రవేశానికి సుదీర్ఘ పోరాటం జరపవలసి వచ్చింది. ఇటీవలి కాలంలో మాత్రమే దేవాలయప్రవేశానికి అవకాశం లభించింది. ఒక ముస్లిం రోజుకు అయిదు పూటలు నమాజు కోసం మస్జిద్‌కు వెళ్ళగలడు. కాని, నంధనార్‌కు ఆలయ ప్రవేశం లభించలేదు. అగ్ని ప్రవేశం లభించింది. కాగా ఇస్లాం శుక్రవారం ప్రార్థనకు మస్జిదుకు రాని వ్యక్తి ఇంటిని తగలబెట్టడం జరుగుతుందని హెచ్చరించింది.

ఈ వాస్తవాలు తెలిసిన వ్యక్తి కళ్ళు నీటితో నిండిపోతాయి. అందువల్ల ఇస్లాం మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారం.

డియర్ బ్రదర్ !

మీ సెక్రటరీ తిరుకొడిక్కల్ చెల్లప్ప, నేను ఇటీవల టెంకాయిపట్నంలో ఒక ఫంక్షన్‌లో కలుసుకొన్నాము. అక్కడ ఒక ముస్లిం బాలుడు తలపై టోపి ధరించి కనబడ్డాడు. అతడ్ని అందరూ ఇబ్రాహీం సాబ్ అని పిలుస్తున్నారు. ఆ ఫంక్షన్‌లో ఆ బాలుడు ఖుర్‌ఆన్ పారాయణం వినిపించాడు. అతడు 'ఇమామ్' అవుతాడట. అతడ్ని మాకు పరిచయం చేసినపుడు అతను మీనాక్షి పురంలో మతం మార్చుకున్న ఓ కుటుంబానికి చెందినవాడని తెలిసింది. కొడిక్కల్ చెల్లప్ప ఈ సంగతి విని చలించిపోయాడు. ఆయనకు చిన్నప్పుడు హిందూ వేదపాఠశాలలో ప్రవేశం లభించలేదట!

హిందూ దేవాలయ పూజారులయ్యే అవకాశం దళితులకు లేదు. సుప్రీంకోర్టు మొదలు మామూలు స్థాయి అగ్రవర్ణ పౌరుల వరకు ఎవరూ ఈ విషయాన్ని ఒప్పుకోరు.

కాని, ఇస్లాంలో కొత్తగా ప్రవేశించిన వ్యక్తి కూడా ఇమామ్ సాహెబ్ కాబోవడం చూసిన కొడిక్కల్ చెల్లప్ప ఈ బాలుడు అన్ని విధాల అణచివేతలను అధిగమించాడని, ఇమామ్ సాహెబ్‌గా గౌరవాన్ని, ఆదర్శాన్ని పొందుతున్నాడని



అన్నారు. (కొడిక్కల్ చెల్లప్ప ఈ సంఘటన జరిగిన తరువాత తిరుచ్చిలో, నా సమక్షంలో ఇస్లాం స్వీకరించారు).

మరో సంఘటన– రామానంద్ ఒక నవముస్లిం. ఇటీవలే అతను ఇస్లాం స్వీకరించాడు. ఆయన్ను కొందరు ముస్లింలు భోజనానికి పిలిచారు. అయితే అతడు సంకోచించి వెనకాడాడు. అతగాడిని వాళ్ళు చేతులు పట్టుకొని బలవంతాన తీసుకుపోయి తమతో భోజనానికి కూర్చోబెట్టారు. "రండిసార్, మనమంతా ఆదం సంతానమే" అంటూ బలవంతం చేశారు.

దళిత కులానికి చెందిన రామానంద్ వృద్ధుడు. ఈమాట వినగానే ఆ వృద్ధుని కళ్ళు ఆనంద భాష్పాలతో నిండిపోయాయి. "నా జీవితంలో ఇలాంటి ప్రజల ఇంటిలో ప్రవేశించే అవకాశం ఇదివరకు నాకెన్నడూ లభించలేదు. మాకు అగ్రవర్ణాల ఇళ్ళల్లోకి ప్రవేశం లేదు. వారితో పాటు సమానస్థాయిలో కూర్చునే అనుమతి లేదు. వారితో కలసి మేము భోజనం చేయలేం" అన్నాడతను. ఇలా అతను తన బాధాకరమైన అనుభవాలను మననం చేసుకున్నాడు. ఇస్లాంలో సమానత్వం అన్నది కేవలం సిద్ధాంతానికే పరిమిత మైన నినాదం కాదు. ఆచరణాత్మకంగా అది జీవితంలో కనబడుతుందనడానికి ఇది ఒక నిదర్శనం.

## ఒక ప్రశ్న

సాంఘిక అణచివేతలు తొలగిపోవాలని, సమానత్వం రావాలని అందరూ ఆవేశంగా ప్రసంగిస్తారు. ఈ విషయమై సమావేశాలు జరిపి తీర్మానాలు చేస్తారు. బహిరంగ సభల్లో ప్రచారం చేస్తారు. ఆందోళనలు చేస్తారు. కొందరు త్యాగాలు కూడా చేశారు. కాని పట్టించుకునేది ఎవరు? కాంగ్రెసులోని "ది లీగ్ ఆఫ్ సప్రెస్డ్ క్లాసెస్" దళితుల కష్టాల గురించి గొంతువిప్పింది. కాని వినిపించుకున్నవారే లేరు.

చాలామంది దళితులు ద్రవిడ ఉద్యమంలో చేరారు. అనేక త్యాగాలు చేశారు. కాని ప్రయోజనం ఏదీ పొందలేకపోయారు.

## కమ్యూనిస్టు పార్టీ పరిస్థితి కూడా అంతే !

డాక్టర్ అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించారు. ఆయన అనేకమంది దళిత ప్రజలతో కలసి బౌద్ధమతంలో చేరారు. కాని దానివల్ల ఎలాంటి ప్రభావమూ కనిపించలేదు. కాగా, మీనాక్షిపురంలో కేవలం రెండువందల మంది ఇస్లాం స్వీకరించారు. వెంటనే అలజడి మొదలయ్యింది. భూమ్యాకాశాలను ఏకం చేసే అలజడి అది.

శంకరాచార్యులతో పాటు వివిధ మతాల ఆచార్యులందరూ వెంటనే మీనాక్షిపురం పరుగెత్తుకువచ్చారు. చిన్మయానంద, సుబ్రహ్మణ్యం స్వామి, ఆరెస్సెస్ వాళ్ళు, హిందూమున్నాని, భారతీయ జనతా పార్టీ– అందరూ తీవ్రమైన ఆందోళనకు, దిగులుకు గురయ్యారు. చివరకు ఇందిరాగాంధితో సహా సోకాల్డ్ సెక్యులర్ ప్రభుత్వం కూడా ఎంతో ఆందోళన చెందారు.

## ప్రియమైన పెరుమాల్ గారూ !

అనేక రోజులు రాత్రింబవళ్ళు కష్టపడి మీరు తయారుచేసిన నివేదిక జాగ్రత్తగా భద్రం చేయబడింది. కాగా, కేవలం రెండు వందల మంది హిందూ ధర్మాన్ని వదలి ఇస్లాంలో చేరిన వెంటనే ఎంత భారి స్థాయిలో ఆందోళన ప్రతిక్రియలు జరిగాయో మీరు కళ్ళారా చూశారు.

లక్షలాది ప్రజలు క్రైస్తవంలో చేరినా ఎవరూ పట్టించుకోలేదు. కాని కేవలం రెండువందల మంది ఇస్లాంలో చేరితే ఇంత హంగామా ఎందుకు?

మీనాక్షిపురం సంఘటన తర్వాత, కంచీ మఠాధిపతి కేరళలో ఒక అంటరాని, ఆదిద్రావిడ పూజారి నుంచి ప్రసాదం స్వీకరించారు. అప్పుడు మతపెద్దలు ఆది ద్రావిడ నివాసాల వద్దకు పరుగు పరుగున వెళ్ళారు. ప్రభుత్వం అధికారులను, అక్కడకు పంపి ఆది ద్రావిడుల అవసరాలేమిటో గ్రహించి వాటిని నెరవేర్చమని ఆదేశించింది. హిందూమతానికి చెందిన పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు భారీ మొత్తంలో నిధులు పంపి, మతం మార్చుకున్న వారిని మళ్ళీ వెనక్కి రప్పించే ప్రయత్నాలు చేశారు.



ఈ పరిణామాలన్నీ చూస్తే మీకేం అర్థమవుతోంది? అప్పటి వరకు దళిత ప్రజలను ఏమాత్రం పట్టించుకోని హిందూ పెద్దలకు, మతం పరివర్తనల తర్వాత ఈ ప్రజల పట్ల అంత శ్రద్ధ ఎందుకు కలిగింది?

దళితులు ఇస్లాంను స్వీకరించడమే పెద్ద సమస్య అయింది వారికి. ఇస్లాం ధర్మాన్ని స్వీకరించిన తరువాత వాళ్ళు అగ్రవర్ణాల ఆధిక్యతల బంధనం నుంచి బయటపడతారన్నదే వారి భయం. అయితే ఈ మత పరివర్తనాల పట్ల తీవ్ర ఆందోళన చెందినవారు దళితులపై పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు పెట్టినవారు సాంఘిక అణచివేతల విషయంలో మాత్రం ఎలాంటి హామీగాని గ్యారంటీగాని ఇవ్వలేదు. ప్రదర్శన కోసం చేసిన పనులు కూడా నామమాత్రం గానే ఉన్నాయి. దళితులను ఇస్లాం స్వీకరించకుండా ఏదో ఒక విధంగా నిరోధించాలన్న తపన, ఆదుర్దా మాత్రమే కనబడింది వారిలో.

అంటే ఈ అగ్రవర్ణ పెద్దలు సాంఘిక అణచివేతల విషయమై ఆందోళన చెందలేదు. కేవలం ఈ అన్యాయాలపై, అణచివేతలపై ముసుగు ఎలా వేయాలా అని మాత్రమే మధనపడ్డారు. (అప్పుడు వారికి ఒక ఆలోచన తట్టింది.) దళితులు కేవలం అరబ్ పెట్రోడాలర్ల ప్రభావం వల్ల మాత్రమే మతం మార్చు కున్నారని పుకార్లు పుట్టించారు. ఆ విధంగా వారు ఎంతో జాగ్రత్తగా సాంఘిక అణచివేతలపై ముసుగు కప్పారు. సాంఘిక అణచివేతలను తొలగించడం గురించి, ఈ అన్యాయాలను అడ్డుకోవడానికి చేపట్టే చర్యల గురించి వారసలు పెదవి విప్పలేదు.

ప్రభుత్వం పోలీసులను పంపి మతం మార్చుకున్న వారిని భయపెట్టింది. కొందరిని గుండాచట్టం క్రింద అరెస్టు చేసే అనాగరిక చర్యలకు సయితం పాల్పడింది. కేంద్రమంత్రులు, ఇంకా అనేకమంది పెద్దలు ఈ మత పరివర్తనాలకు అరబ్బు డాలర్లే కారణమయని నిర్ణయం చేశారు. ముస్లిం పెద్దలు ఈ విషయాన్ని నిరూపించవలసిందిగా సవాలు చేసినపుడు దానికి ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు. ఆవిధంగా (ఆధారంలేని) వ్యాఖ్యలు చేసినందుకు కొందరు విచారం వెలిబుచ్చారు.

ఈ జిత్తులమారి నక్కలకు దళిత వర్గాల పట్ల ఎలాంటి అభిమానం లేదని దీన్నిబట్టి స్పష్టంగా తెలుస్తోంది. ఈ బానిస వ్యవస్థ శాశ్వతంగా ఉండాలన్నది వారి కోరిక. ఈ చెడు బుద్ధుల పెద్దల మాయాజాలం నుంచి దళిత ప్రజలను బయటకు తీసి వారికి ఇస్లాం గురించి తెలియజేయవలసిన అవసరం ఎంతయినా ఉంది. వారికి ఇస్లామీయ బోధనలు తెలుపవలసిన అవసరం ఉంది.

తొందరపాటు నిర్ణయాలతో దళితులు ఎవరూ ఇస్లాంలో చేరకూడదు. అన్నింటి కన్నా ముందు, సంవత్సరాల తరబడి దళితులపై జరుగుతున్న అన్యాయాలు, అణచివేతలను ఇక ఆపండని సర్వత్రా అప్పీలు జారీ కావాలి.

ఈవిధంగా ఒక అల్టిమేటం ఇచ్చి కొన్నాళ్ళు వేచిచూడాలి. సాంఘిక అణచివేతలను నిర్మూలించే విషయంలో నిజాయితితో కూడిన ప్రయత్నాలు ప్రారంభమవుతాయా లేదా అన్నది గమనించాలి.

ఒకవేళ మీ అప్పీలుకు ఎలాంటి ప్రతిస్పందన లేనట్లయితే– అంటే ఈ అన్యాయాలు, అణచివేతలు అలాగే కొనసాగుతుంటే–

మీరు మరో అప్పీలు జారీ చేయడం మంచిదని నా సలహా. ఆ అప్పీలు ఈవిధంగా ఉండాలి :

> "మతం మార్చుకోవడం మా జన్మహక్కు. ఏచట్టం లేదా పోలీసులు, సైనికులు ఎవరూ దాన్ని ఆపలేరు. హిందూ మతతత్వ వాదులు, సంస్థలు (మున్నాని సంస్థ) కూడా మమ్మల్ని అడ్డుకోలేవు.
>
> ఒకవేళ ప్రభుత్వం ధర్మపరివర్తనల నిషేధం విధించాలనుకుంటే, మేము దానికి అన్ని విధాల త్యాగాలకు సిద్ధంగా ఉన్నాము. మేము హిందువులుగా అవమానాలతో జన్మించాం. మేమిక హిందూ సంస్కృతిలో ఈ అవమానాలతో మరణించదలచుకోలేదు. మేము ఈ అవమానాలను, అణచివేతలను తుడిచిపెట్టి ఇస్లాం సమాజంలో ముస్లింల సోదరులుగా మరణించాలనుకుంటున్నాం."



**మనం ఒక సారి పుట్టాము, ఒక సారే చస్తాము.**

**మనం గౌరవప్రదంగా, ఎలాంటి అవమానాలు లేకుండా మరణిద్దాం– ముస్లిములుగా.**

(అడియార్ ఈ చిరుపుస్తకం 1986లో రాశారు. ఈ పుస్తకాన్ని చదివిన అనేకమంది పాఠకులు ఇస్లాం స్వీకరించారు. 1987లో రచయిత ఇస్లాం స్వీకరించి ఇస్లామీయ పేరు అబ్దుల్లా అడియార్ అని పెట్టుకొన్నారు. శ్రీ ఇలయ పెరుమాల్ కూడా తన అనుచరులకు ఇస్లాం స్వీకార అనుమతి ఇచ్చారు. అలా చాలామంది ఇస్లాం స్వీకరించారు– అల్ హమ్దులిల్లాహ్.

**(–సమాప్తం–)**

**అబ్దుల్లా అడియార్ గారి "ఇస్లాం కాల్స్ యు" అనే ఇంగ్లీషు పుస్తకాన్ని తెలుగులో అనువదించి ప్రచురించుకోడానికి అనుమతించిన "ఇస్లామిక్ దావా మిషన్ ఆఫ్ ఇండియా, చెన్నయ్ వారికి; ఈ పనిలో మాతో సహకరించిన ముహమ్మద్ అహ్మద్ (నెల్లూర్) గారికి మా కృతజ్ఞతలు.**

**అబుల్ ఇర్ఫాన్,**
**ఫౌండర్ చైర్మన్,**
**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్**

